




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును

భూమి ప్లాట్ నిర్వహణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పొడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భావన.




కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066


సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 203 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | బుధవారం 15 ఏప్రియల్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-

### లక్షలాది మందిని

## క్వాంటం నిపుణులుగా

# తీర్చిదిద్దుతాం


- దేశంలోనే తొలి క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ ప్రారంభం
- క్వాంటం టెక్నాలజీలో దేశానికే దిక్సూచిగా ఆంధ్రప్రదేశ్
- ఎస్ఆర్ఎం వర్సిటీ, మేధా టవర్స్‌లో అత్యాధునిక టెస్ట్ బెడ్స్ ఏర్పాటు
- మైనస్ 273 డిగ్రీల సెల్సియస్ వద్ద పనిచేసే ప్రపంచ స్థాయి సాంకేతికత
- అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘన నివాళి
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని 45 లక్షల మందిని ఏఐ, క్వాంటం, సైబర్ డేటా సెక్యూరిటీలో నిపుణులుగా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. సాంకేతికతను అనుసరించడమే కాకుండా దానిని ఆవిష్కరించే స్థాయికి ఏపీ ఎదిగేలా ప్రోత్సహిస్తున్నామని వెల్లడించారు. ప్రతి పౌరుడికి ఏఐ లాంటి సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అమరావతిలోని మిగతా .. 2లో..

### వైకాపా ఉన్మాదం.. ఉగ్రవాదం కంటే

## ప్రమాదకరంగా మారింది

### మంత్రి పార్థసారథి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** జగన్ ఏం చెబితే అది చేస్తాం.. ఆత్మాహుతి దళంగా పనిచేస్తామంటున్నవారు నాయకులా..? లేక ఉగ్రవాదులా? అని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర వినాశనం కోరుకుంటున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు. "అగ్రనాయకత్వం ఆలోచనలో తప్పు ఉంటే చర్చించాల్సింది పోయి.. గుడ్డిగా అనుసరిస్తారా? అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే వైకాపా పనిగా పెట్టుకుంది. రాష్ట్రంలో వైకాపా ఉన్మాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారింది. వైకాపా హయాంలో అరాచక పాలన సాగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. అభివృద్ధి కంటే.. విధ్వంసానికి ప్రాధాన్యత ఇచ్చింది" అని మండిపడ్డారు.

### వచ్చే ఏడాది హరిద్వార్‌లో

## కుంభమేళా

### ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే ఏడాది ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో కుంభమేళా నిర్వహించనున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. కుంభమేళా నిర్వహణకు వీలుగా 'దేవ్‌భూమి'ని శుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశుభ్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని..పుణ్యస్థలాల్లో ప్రజలు కూడా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. భారతదేశ సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలు ప్రతిబింబించేలా కుంభమేళాను పరిశుభ్రంగా, వైభవంగా జరుపుకొందామన్నారు. దేశవ్యాప్తంగా భక్తులు ఆసక్తిగా ఎదురు చూసే మినీ చార్‌ధామ్ యాత్ర కూడా మరికొన్ని నెలల్లో ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలో భక్తుల రాకతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయన్నారు. ఢిల్లీ-డెహ్రాడూన్ ఎకనమిక్ కారిడార్‌ను ప్రారంభించిన అనంతరం మోదీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మౌలిక సదుపాయాల వృద్ధిపై దృష్టిపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రారంభించిన 213 కిలోమీటర్ల హై-స్పీడ్, యాక్సెస్-కంట్రోల్డ్ హైవే ఢిల్లీ- డెహ్రాడూన్ మధ్య ప్రయాణ సమయాన్ని ఆరు గంటల నుంచి రెండున్నర గంటలకు తగ్గిస్తుందన్నారు. కొత్త ప్రాజెక్ట్ వల్ల ఈ ప్రాంత ఆర్థిక స్వరూపం పూర్తిగా మారిపోతుందని.. రోడ్లు, జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వేలు, విమాన, జలమార్గాలు కలిసి దేశ భవిష్యత్ మార్గాన్ని నిర్దేశిస్తాయన్నారు.

### ఛత్తీస్‌గఢ్‌లోని

## పవర్ ప్లాంట్‌లో పేలుడు


### పలువురి మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఛత్తీస్‌గఢ్‌లోని వేదాంత పవర్ ప్లాంట్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మృతి చెందగా.. 30మందికి పైగా కార్మికులు తీవ్ర గాయాలపాలైనట్లు అధికారులు వెల్లడించారు. మంగళవారం కార్మికులు పని చేస్తున్న సమయంలో బాయిలర్‌లో వైఫల్యం తలెత్తడంతో ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడించారు. వెంటనే కార్మికులు బయటకు పరుగులు తీయడానికి ప్రయత్నించడంతో ప్లాంట్‌లోపల తొక్కిసలాట వంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో మరికొంతమంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

### గోదావరి పుష్కరాలపై త్వరలో

## ఉప ముఖ్యమంత్రి పవన్ సమీక్ష



**నిడదవోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై త్వరలో రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమీక్ష నిర్వహిస్తారని మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం వివిధ అంశాలపై పవన్ చర్చించినట్లు ఆయన చెప్పారు. పుష్కరాలకు సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సదుపాయాలు, భద్రతకు పెద్దపీట వేయాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్‌ల వద్ద ఆధునికీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని దుర్గేష్ చెప్పారు. ప్రత్యేక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విశ్రాంతి గదుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ట్రాఫిక్ ఇబ్బందులు మిగతా .. 2లో..

### అంబేద్కర్ పేరును పలకడం కాదు..

## ఆశయాల ఆచరణే ముఖ్యం

### వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాల కొనసాగింపుపై ఆయన చేసిన ట్వీట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. "అంబేద్కర్‌ని గుర్తు చేసుకోవడం అంటే మిగతా .. 2లో..

### ఏప్రిల్ 15న

## ఏపీ ఇంటర్ ఫలితాలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో ఇంటర్ ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను బుధవారం (ఏప్రిల్ 15) ఉదయం 10.31గంటలకు విడుదల కానున్నాయి. ఈ విషయాన్ని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ఫలితాలను మనమిత్ర ద్వారా వాట్సప్‌లోనూ (9552300009) ఈ ఫలితాలు పొందొచ్చని మంత్రి పేర్కొన్నారు. ఏపీలో ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన ఇంటర్ పబ్లిక్ మిగతా .. 2లో..

### ఇకపై లోక్‌సభలో

## 850 స్థానాలు..?



**విశ్వం వాయిస్ న్యూస్ :** నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ బిల్లులకు రంగం సిద్ధమైంది. ఈ నెల 16న రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. ఈ రెండింటి గురించి పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మిగతా .. 2లో..

### మరో 70 ఏళ్లు

## తుంగభద్ర 'క్రస్ట్‌గేట్ల'కు ఢోకా లేదు

### జలాశయాల ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు



**హోసపేటె, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రస్తుతం తుంగభద్ర జలాశయానికి బిగిస్తున్న క్రస్ట్‌గేట్లకు ఎలాంటి నిర్వహణ చేయకపోతే 20 ఏళ్లు, ఏటా నిర్వహణ చేస్తే మరో 70 ఏళ్లు ఎలాంటి ఢోకా ఉండదని జలాశయాల ఇంజినీరింగ్ నిపుణుడు కన్నయ్య నాయుడు మిగతా .. 2లో..

### బిహార్ సీఎం నీతీశ్ కుమార్

## రాజీనామా



**విశ్వం వాయిస్ న్యూస్ :** బిహార్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ముఖ్య మంత్రి నీతీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేశారు. లోక్‌భవన్‌కు చేరుకున్న ఆయన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు అందజేశారు. అంతకుముందు క్యాబినెట్ చివరి సమావేశాన్ని ఏర్పాటు చేసి.. మంత్రివర్గ రద్దు విషయాన్ని సహచరులకు తెలియజేశారు. బిహార్ ముఖ్యమంత్రిగా దాదాపు రెండు దశాబ్దాలు కొనసాగిన నీతీశ్ కుమార్ ఇటీవల రాజ్యసభ ఎంపీగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. మరోవైపు, ఎన్డీయే కూటమి మరికాసేపట్లో కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేయనుంది. బుధవారం కొత్త ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఇప్పటివరకు మిగతా .. 2లో..

## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్

### 40 నిమిషాలపాటు సంభాషణ



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు తీవ్రరూపం దాల్చిన వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. దాదాపు 40 నిమిషాల పాటు వీరు మాట్లాడుకున్నట్లు సమాచారం. పశ్చిమాసియాలో మిగతా .. 2లో..

### ప్రమాదంలో

## యూకే జాతీయ భద్రత

### నాటో మాజీ చీఫ్ జార్జ్ రాబర్ట్‌సన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రిటన్ రక్షణ బడ్జెట్ అంశంపై ఇటీవల తీవ్ర చర్చ జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో నాటో మాజీ చీఫ్ జార్జ్ రాబర్ట్‌సన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయ ఉదాసీనత, రక్షణ రంగంలో తక్కువ పెట్టుబడుల కారణంగా బ్రిటన్ జాతీయ భద్రత ప్రమాదంలో పడిందన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ మిగతా .. 2లో..

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

### అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి అంబేద్కర్ ఉత్సవాలలో పాల్గొన్నారు. తొలుత మిగతా .. 2లో..

## డీల్‌పోయే.. ఖర్చు మిగిలే

### హోటల్ బిల్లు కట్టలేక పాక్ అవస్థలు..




**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచింది. ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతోన్న ఆ దేశం.. చర్చల ఫలితంతో సంబంధం లేకుండా ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటోంది. దీనికి సంబంధించిన మీడియా కథనాల ప్రకారం.. పశ్చిమాసియా ఘర్షణలకు ముగింపు పలికి అంతర్జాతీయంగా ఖ్యాతి తెచ్చుకోవాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## లక్షలాది మందిని క్వాంటం నిపుణులుగా తీర్చిదిద్దుతాం

ఎస్ఆర్ఎం వర్సిటీ, గన్నవరం మేధాటవర్స్‌లో ఏర్పాటు చేసిన క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను ఎస్ఆర్ఎం వర్సిటీ నుంచి ఆయన ప్రారంభించారు. 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను సీఎం జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు నుంచి అమరావతిలో క్వాంటం వ్యాలీ కూడా ప్రారంభమవుతుందని తెలిపారు. వన్ ఫ్యామిలీ వన్ ఆంత్రప్రెన్యూర్‌తో పాటు ప్రతీ వెయ్యి మందికి ఒక స్టార్టప్‌ను తీసుకురావాలని ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించారు. ఆర్టీఐహెచ్ ద్వారా స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహిస్తున్నామని చంద్రబాబు వివరించారు. ఐఐటీ చెన్నై, ఐబీఎం సంస్థల భాగస్వామ్యంతో లక్షలాది మందిని క్వాంటం రంగంలో నిపుణులుగా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. కొత్త సంస్థలు, నైపుణ్యం, క్వాంటం మౌలిక సదుపాయాలతో భవిష్యత్తును నిర్మిస్తున్నామని అన్నారు. ఔషధాల ఆవిష్కరణ, వ్యవసాయ ఉత్పాదకత, రక్షణ పరిశోధన, లాజిస్టిక్స్ లాంటి రంగాల్లో వినూత్న ఆవిష్కరణలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. డిజిటల్ లావాదేవీలు మరింత సురక్షితంగా మారే అవకాశం ఉందన్నారు. క్లైమేట్ మోడలింగ్ లాంటి అంశాలను చేపట్టవచ్చని అభిప్రాయపడ్డారు. క్రయోజనిక్స్, ఫ్యాబ్రికేషన్, యాంప్లిఫైడ్ రీసెర్చ్‌లలో విస్తృతంగా ఆవిష్కరణలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

**అమరావతిలో ఏదో మ్యాజిక్ ఉంది: ఎల్.వి. సుబ్రమణ్యం**

అమరావతిలో కంపెనీ ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇచ్చారని క్యూబిట్‌ఫోర్స్ సీఈవో ఎల్. వెంకట సుబ్రమణ్యం అన్నారు. దేశంలోనే తొలి క్వాంటమ్ కంప్యూటర్ తయారు చేయాలన్నదే లక్ష్యమని చెప్పారు. నాలుగు నెలల్లోనే క్వాంటం బెడ్‌లు తయారు చేయగలమని అస్సలు ఊహించలేదు. అమరావతిలో ఏదో మ్యాజిక్ ఉంది. అందుకే ఇది సాధ్యమైంది. ముఖ్యమంత్రి పిలుపును ఛాలెంజ్‌గా తీసుకొని ముందడుగు వేశాం. నిన్నటి విజన్.. నేటి నిజం.. రేపటి పరిశ్రమ.. ఇదే అమరావతి క్వాంటం" అని అన్నారు.

**దేశంలోనే తొలి క్వాంటం ఫెసిలిటీ సెంటర్ ప్రారంభం**

దేశంలోనే తొలి క్వాంటం ఫెసిలిటీ సెంటర్‌ను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీ, గన్నవరం మేధాటవర్స్‌లో ఏర్పాటు చేసిన క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను ఎస్ఆర్ఎం వర్సిటీ నుంచి ఆయన ప్రారంభించారు. 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను సీఎం జాతికి అంకితం చేశారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. దీనికి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహకారం అందించింది. ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సభ్యులు సహా ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగ శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్‌ల ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరయ్యారు. ఏపీలోని వివిధ వర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్‌గా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తున్నారు.

**బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళి**

భారత రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పిస్తున్నాను. అంటరానితనంతో కులవివక్షకు గురై కూడా ఉన్నత విద్యను అభ్యసించి దేశం గర్వించే అత్యున్నత స్థాయికి ఎదిగిన అంబేద్కర్ ఆదర్శప్రాయులు. ప్రపంచంలో బలమైన ప్రజాస్వామ్య దేశంగా మన దేశం నిలుస్తోంది అంటే దానికి కారణం ఆయన మనకు ఇచ్చిన రాజ్యాంగం. సమాన అవకాశాలు, హక్కులు అందించి, ప్రతి పౌరుడికి రాజ్యాంగ రక్షణ కల్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనే మన లక్ష్యం కావాలి. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ, బాధ్యత కలిగిన పౌరుడిగా ఉండడమే ఆ మహనీయునికి మనం ఇచ్చే ఘన నివాళి.

## బిహార్ సీఎం నీతీశ్ కుమార్ రాజీనామా

ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సమ్రాట్ చౌధరీ కొత్త సీఎం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సమాచారం. కేంద్ర సహాయమంత్రి నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రధానంగా వినిపిస్తోంది.

**గోదావరి పుష్కరాలపై త్వరలో**

## ఉప ముఖ్యమంత్రి పవన్ సమీక్ష

తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని పవన్‌కల్యాణ్ ఆదేశించారన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రద్దీని క్రమబద్ధీకరించనున్నట్లు చెప్పారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పుష్కరాలను నిర్వహించాలని పవన్ ఆదేశించినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు.

**అంబేద్కర్ పేరును పలకడం కాదు..**

## ఆశయాల ఆచరణే ముఖ్యం

ఆయన వారసత్వాన్ని అనుసరించడం కాదు.. ఆ ఆశయాలను ఆచరణలో పెట్టడం. ఆయన పేరును ఎన్ని సార్లు పలుకుతామన్నది కాదు.. ఆయన విజన్‌ను ఎంత స్థిరంగా ముందుకు తీసుకెళ్తామన్నదే ముఖ్యం. అదే ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవం" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఆంగ్ల పత్రిక కోసం తాను రాసిన వ్యాసాన్ని కూడా పంచుకున్నారు. ఆ వ్యాసంలో అంబేద్కర్ వారసత్వాన్ని కేవలం జ్ఞాపకార్థకంగా కాకుండా.. సమానత్వం, న్యాయం, రాజ్యాంగ విలువలను పాలనలో ఆచరణలో పెట్టడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

## ఏప్రిల్ 15న ఏపీ ఇంటర్ ఫలితాలు

పరీక్షలు మార్చి 23 వరకు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంలో కొంత ఆలస్యమైనప్పటికీ అనుకున్న సమయానికన్నా ముందే ఫలితాలను విడుదలకు సిద్ధం చేయడం విశేషం.

## ఇకపై లోక్‌సభలో 850 స్థానాలు..?

ఎంపీలకు సమాచారం ఇచ్చింది. ఆ ప్రతులను వారికి పంపింది. నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లు ప్రతిపాదనల ప్రకారం.. రాష్ట్రాల్లో 815 వరకు లోక్‌సభ స్థానాలు పెంచనున్నారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో 35 వరకు స్థానాలు పెరిగే అవకాశం ఉంది. దీంతో మొత్తం లోక్‌సభ స్థానాలు 543 నుంచి 850కి చేరొచ్చని తెలుస్తోంది. లోక్‌సభలో ఇందుకు సంబంధించిన బిల్లు ఆమోదం పొందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుచేసి చకచకా సీట్ల పెంపు కార్యక్రమం పూర్తిచేసి 2029 ఎన్నికల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. సీట్ల పెంపు దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు కూడా పెరుగుతాయని సమాచారం. జనగణన తర్వాత అందులో వచ్చిన లెక్కల ఆధారంగా దామాషా ప్రకారం సీట్ల పెంపునకు అనుమతిస్తే ఉత్తర, దక్షిణ భారతదేశాల మధ్య తేడా వచ్చే అవకాశం ఉందని తొలినుంచి దక్షిణాది రాజకీయపార్టీలు ఆందోళన వ్యక్తంచేస్తున్న నేపథ్యంలో.. అన్ని రాష్ట్రాల్లో సగటున లోక్‌సభ, అసెంబ్లీ సీట్లు 50% పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీనివల్ల అన్ని రాష్ట్రాలకూ ఇప్పుడున్న రాజకీయ ప్రాతినిధ్యం యథాతథంగా కొనసాగే అవకాశం ఉంటుందని సమాచారం.

**సమావేశం కానున్న ఇండియా కూటమి..**

నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై బుధవారం ఇండియా కూటమి నేతలు భేటీకానున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఈ సమావేశం జరగనుంది. బిల్లులో ప్రతిపాదించిన అంశాలపై సమాచారం అందిన నేపథ్యంలో.. వాటిపై చర్చించనున్నారు.

**మరో 70 ఏళ్లు**

## తుంగభద్ర 'క్రస్ట్‌గేట్ల'కు ఢోకా లేదు

తెలిపారు. మంగళవారం తుంగభద్ర క్రస్ట్‌గేట్ల బిగింపు పనులను పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడు నెలల్లో 26 గేట్లను బిగించడం మంచి పురోగతి అని కొనియాడారు. మిగిలిన గేట్లను ఈ నెలాఖరులోగా బిగించే అవకాశం ఉందన్నారు. ఒకవేళ ముందుగా వర్షాలు కురిసి, డ్యామ్‌కు వరద వచ్చి చేరినా.. ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. కొత్త గేట్ల బిగింపుతో తుంగభద్ర రైతులకు ఎంతో మేలు కలుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. తుంగభద్ర మండలి కార్యదర్శి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మొత్తం రూ.51 కోట్లతో పనులు చేపట్టామన్నారు. గేట్ల బిగింపునకు రూ.44 కోట్లు, గొలుసుల తయారీకి రూ.5.1 కోట్లు, ఇతర ఖర్చులకు రూ.1.34 కోట్లు వెచ్చించినట్లు వివరించారు.

## డీల్‌పోయే.. ఖర్చు మిగిలే

అమెరికా–ఇరాన్ మధ్య శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చింది. అందుకు ఇస్లామాబాద్‌లోని సెరెనా హోటల్ వేదికైంది. అటు యూఎస్.. ఇటు ఇరాన్ నుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులు వచ్చారు. చర్చల్లో ఎలాంటి ఫలితం రాలేదు కానీ.. హోటల్ బిల్లులు మాత్రం మోగిపోయాయని నిఘా వర్గాలను పేర్కొంటూ కథనాలు వచ్చాయి. ఆ బిల్లుల్ని పాక్ ప్రభుత్వం చెల్లించలేదట. సమస్యను పరిష్కరించేందుకు హోటల్ యజమాని రంగంలోకి దిగాల్సి వచ్చిందని రాసుకొచ్చాయి. రెండు దేశాలకు ఆతిథ్యం ఇచ్చినప్పుడు వచ్చే రొటీన్ ఖర్చులు కూడా చెల్లించడంలో పాక్ విఫలమైందని పేర్కొన్నాయి. పాక్ దౌత్య ఆశయాలకు, అంతర్గతంగా నెలకొన్న ఆర్థిక అస్థిరతలకు మధ్య ఎంతో దూరముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆర్థిక సమస్యల నుంచి తాత్కాలికంగా గట్టెక్కేందుకు అంతర్జాతీయ ద్రవ్యనిధిని ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మరోవైపు ద్రవ్యోల్బణం ఏడు నుంచి తొమ్మిది శాతం మధ్య ఉంది. ఈ సమస్యల మధ్య మరోదఫా యూఎస్–ఇరాన్ మధ్య చర్చలు జరగనున్నాయి. ఏప్రిల్ 21తో రెండువారాల కాల్పుల విరమణ ముగియనుంది. ఈ లోపే ఆ చర్చలు ఉండొచ్చని తెలుస్తోంది.

## ప్రధాని మోదీకి ట్రంప్ ఫోన్

పరిస్థితులు, భారత్–అమెరికాల మధ్య ద్వైపాక్షిక సహకారం, హర్మూజ్ జలసంధిని తెరవడంపై ప్రధానంగా చర్చించినట్లు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. అమెరికా–ఇరాన్‌ల మధ్య శాంతి చర్చలు విఫలమైన వేళ అగ్రనేతల సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది. "మిత్రుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన గణనీయ పురోగతిని సమీక్షించాం. అన్ని రంగాల్లో సమగ్ర అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నాం. పశ్చిమాసియాలో పరిస్థితులపైనా చర్చించాం. హర్మూజ్‌ను తెరవడం, సురక్షితంగా ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని మోదీ పేర్కొన్నారు. ఈ పరిణామాలపై భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ స్పందించారు. ఇద్దరి నేతల మధ్య సంభాషణ సానుకూలంగా సాగిందన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న పరిణామాలను ప్రధాని మోదీకి ట్రంప్ వివరించారని తెలిపారు.

## ప్రమాదంలో యూకే జాతీయ భద్రత

తీరుపై విమర్శలు గుప్పించారు. తాము సంసిద్ధతతో లేమని, తమపై దాడి జరుగుతోందని జార్జ్ రాబర్ట్‌సన్ పేర్కొన్నారు. బ్రిటన్ జాతీయ భద్రత, రక్షణ ప్రమాదంలో ఉన్నాయన్నారు. గతంలో నాటో సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన రాబర్ట్‌సన్.. బ్రిటన్ రక్షణ సామర్థ్యాలను సమీక్షించేందుకు స్టార్మర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీకి నాయకత్వం వహించారు. రక్షణ రంగంలో పెట్టుబడులు తక్కువగా ఉండటానికి ప్రత్యర్థి కన్జర్వేటివ్ పార్టీ కారణమని స్టార్మర్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఇరాన్ యుద్ధం తమకు మేల్కొలుపు కావాలని స్టార్మర్ చెబుతున్నప్పటికీ.. ఆయన మాటలకు, చర్యలకు పొంతన ఉండటం లేదని నాటో మాజీ చీఫ్ విమర్శించారు. ఆ రంగంలో అవసరమైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రధాని సుముఖంగా లేరని ఆరోపించారు. సైనికేతర నిపుణులు తీసుకుంటున్న నిర్ణయాలు బ్రిటన్ ఖజానాను ధ్వంసం చేస్తున్నాయని దుయ్యబట్టారు.

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

అమలాపురంలోని ఎంపీ నివాసంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమలాపురం పట్టణం నల్లవంతెన సమీపంలోని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమలాపురం రూరల్ భట్నవిల్లి గ్రామంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తదుపరి ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుతో కలిసి ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అయినవిల్లి మండలం చినతనలంక గ్రామంలో జరిగిన అంబేద్కర్ ఉత్సవాలలో ఎంపీ హరీష్ పాల్గొన్నారు. కొత్తపేట రెడ్డప్పవారిపేటలో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఎంపీ హరీష్ బాలయోగి పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**అంబేద్కర్ జయంతి**

## దళితుల ఐక్యతను ప్రతిబింబిస్తుంది

**మండల వ్యాప్తంగా ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు**

**ముఖ్యఅతిథిగా అసలైన అమలాపురం మాజీ ఎంపీ హర్ష కుమార్**






**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా మండల వ్యాప్తంగా యువకులు, అధికారులు, రాజకీయ నాయకులు మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రం రాయవరంలోని దళితవాడలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించగా, అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు జీవీ హర్ష కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభంలో స్థానిక నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తొలుత మండల పరిషత్ అధ్యక్షులు నౌడు వెంకటరమణ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆలోచనలు యువతకు ఆదర్శమని, ఎన్నో అవమానాలు ఎదురైనా ఉన్నత శిఖరాలను అధిరోహించి దేశానికి భవిష్యత్ దిశ చూపిన మహానుభావుడని కొనియాడారు. యువత విద్య, ఉద్యోగాలలో ముందంజలో ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ముఖ్య అతిథి జీవీ హర్ష కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఐక్యతకు ప్రతీకగా మారాయని, దళితులపై జరుగుతున్న వివక్షకు వ్యతిరేకంగా సమాజం ఒక్కటిగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. తదుపరి కార్యక్రమాన్ని ఉద్దేశించి జీవీ సుందర్ మాట్లాడుతూ, విద్య ద్వారానే సామాజిక న్యాయం సాధ్యమని నమ్మిన అంబేద్కర్ జీవితాంతం విద్యార్థిగా నిలిచి గొప్ప విజయాలు సాధించారని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో యువత నడిచి విద్యతో విజయాన్ని అందుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, గారిడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించి, సహపంక్తి భోజనాలతో అంబేద్కర్ పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని సామాజిక వర్గాల పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు

**కాజులూరు మండలం దళిత నాయకుల హెచ్చరిక**



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** దళితుల రక్షణ కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కల్పించిన హక్కుల్ని, చట్టాలని దుర్వినియోగం చేయవద్దని కాజులూరు మండల దళిత నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కాజులూరులో ఎస్సీ సెల్ యువనాయకుడు రంజిత్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సెలపాక మాజీ సర్పంచ్ లు పోతురాజు భీమారావు, పి.గనిరాజు తదితరులు మాట్లాడారు. ఇటీవల కాజులూరు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి తనని, తన భర్తని మాటలతో అవమానించారంటూ దళిత మహిళ సన్నపు లక్ష్మి గొల్లపాలెం పోలీసులకు పిర్యాదు చేసింది. ఈమేరకు శ్రీరామ చంద్రమూర్తి పై లక్ష్మీ తప్పుడు పూర్యాదు చేసిందంటూ కాజులూరు మండల దళిత నాయకులు ఆరోపించారు. మండల పరిధిలో ఎంతోమంది దళిత కుటుంబాలకు శ్రీరామ్ ఎన్నోరకాలుగా సహాయ సహకారాలందించారని పేర్కొన్నారు. తమ వ్యక్తిగత స్వార్థం కోసం అన్యం శ్రీరామ్ పై తప్పుడు పిర్యాదులు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ కమిటీ సభ్యులు, దళిత నాయకులు ఖండవల్లి శ్రీనివాస్, అంద్రంగి మాజీ సర్పంచ్ పి విజయలక్ష్మి, తదితరులు శ్రీరామ్ పై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. చట్టలపై ఉన్న గౌరవాన్ని దిగజార్చొద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల గ్రామాలకు చెందిన దళిత నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్కాన్ చెయ్.. సమాచారం పట్టెయ్.. ఎన్‌హెచ్ఏఐ సరికొత్త ఆలోచన

**శిరివెళ్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయ రహదారులకు సంబంధించిన ఏదైనా సమాచారం కావాలంటే గతంలో అరకొరగా వివరాలు లభించేవి. వాహనదారులకు జాతీయ రహదారుల గురించి, సమీపంలో ఉన్న అత్యవసర సేవల కేంద్రాల గురించి సమగ్ర సమాచారం అందించాలనే ఉద్దేశంతో ఎన్‌హెచ్ఏఐ అధికారులు సరికొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారులపై ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనదారులు రాకపోకలు కొనసాగించే సమయాల్లో ఏదైనా సమాచారం కావాలన్నా, అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలి? ప్రయాణికులు స్టే చేయాల్సి వస్తే హోటల్స్ ఎక్కడున్నాయి? శౌచాలయాలు, పెట్రోల్ బంకులు, ఈ–ఛార్జింగ్ స్టేషన్లు, సమీప పోలీసు స్టేషన్ వివరాలు తెలిసేవి కాదు. ఇకపై ప్రయాణికుల్లో ఎలాంటి ఆందోళనకు తావు లేకుండా ఎన్‌హెచ్ఏఐ అధికారులు క్యూఆర్ కోడ్ రూపంలో సమగ్ర సమాచారాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సెకెన్ల వ్యవధిలోనే సమగ్ర సమాచారం డిజిటల్ గైడ్ రూపంలో సమాచారం అందుబాటులోకి వస్తుంది. కడప – కర్నూలు 40వ జాతీయ రహదారి 190 కి.మీ మేరా విస్తరించి ఉంది. ఈ మార్గంలో ఏర్పాటు చేసిన క్యూర్ కోడ్‌ను వాహనదారులు స్కాన్ చేయగానే ఆ మార్గానికి సంబంధించిన పూర్తి వివరాలు సెకెన్లలో అందుబాటులోకి వస్తాయి. ప్రధానంగా హెల్ప్ లైన్ వివరాలు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వివరాలు, అంబులెన్స్, పోలీస్ స్టేషన్లు, ఫైర్ ఇంజిన్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు వివరాలు.. ఇలా అవసరమైన సమాచారం మన స్మార్ట్‌ఫోన్‌లో ప్రత్యక్షమవుతుంది. ఈ జాతీయ రహదారిని రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిర్వహణ, ప్రాజెక్టు కాలపరిమితి, ఎక్కడెక్కడ టోల్‌ప్లాజాలు ఉన్నాయనే వివరాలు సులభంగా ఒక్కస్కాన్‌లో తెలుసుకోవచ్చు.

## ఎడిటర్ వాయిస్

# చందనోత్సవం.. ఈ సారి భక్తజన ప్రవాహమే

ఉత్తరాంధ్రా ప్రజల ఇలవేలుపు విశాఖ జిల్లాలో ఉన్న ప్రసిద్ధ నరసింహ పుణ్య క్షేత్రం శ్రీ సింహాచలం అప్పన్న స్వామి వారి చందనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయి. ఈ నెల 20న స్వామి వారి చందనోత్సవం జరగనుంది. స్వామి నిజ రూప దర్శనం చూసేందుకు భక్తులు ఏపీ నుంచి మాత్రమే కాదు ఒడిశా చత్తీస్ ఘడ్, జార్ఖండ్, తెలంగాణా నుంచి పెద్ద సంఖ్యలో వస్తారు. ఈ నెల 20న కేవలం నాలుగు గంటలు తప్పించి 20 గంటలకు పీగా స్వామి నిజరూప దర్శనాన్ని భక్తులు చూసేందుకు ఆలయ తలుపులు తెరచే ఉంచుతారు. ఎంత మంది వస్తే అంత మందికి దర్శనం చేయించేందుకు అన్ని రకాలైన చర్యలు తీసుకున్నారు.

రెండు లక్షలకు పైగా : ఇక గతసారి స్వామి వారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య లక్షా ఇరవై వేల పై దాటింది. అయితే ఈసారి ఆ సంఖ్య మరింత పెరగనుంది అని అధికారులు అంచనా వేస్తున్నారు ఏకంగా రెండు లక్షలకు పైగా భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు తరలి వస్తారని పక్కా లెక్కలతో అంచనాలతో తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు ఇన్ని లక్షల మంది వచ్చినా ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూసేందుకు పూర్తిగా అధికార యంత్రాంగం నిమగ్నం అవుతోంది. ఇక మంత్రుల బృందం ఇప్పటికే చందనోత్సవం గురించి సమీక్ష నిర్వహించింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రులు ఆదేశించారు.

సామాన్యుడే వీఐపీ : ఈసారి చందనోత్సవానికి రెండు లక్షల మంది భక్తులు వస్తారు అని అంచనా ఉంది. ఇరవై గంటలకు పైగా దర్శనాలు కొనసాగుతాయి. అంటే గంటకు పదివేల మంది స్వామిని దర్శించుకుంటేనే ఈ రద్దీ అంతా ఆగుతుంది అందరినీ దర్శనం లభిస్తుంది. మరి ఇంత పెద్ద ఎత్తున భక్తులు వస్తే మధ్యలోనే వారిని ఆపేసి వీఐపీలకు పెద్ద పీట వేస్తే సామాన్యులు ఇబ్బందులు పడడమే కాదు ఆగ్రహిస్తారు కూడా. అందుకే కూటమి ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది సామాన్యులకే అగ్ర తాంబూలం ఇస్తామని వారే తమకు వీఐపీ అని చెబుతోంది. వీఐపీలకు ఒక నిర్ణీత సమయం కేటాయించి మిగిలిన మొత్తం సమయం అంతా సామాన్య భక్తులకే కేటాయించాలని చూస్తోంది అని అంటున్నారు.

అపురూపమైన ఘట్టం : నిజానికి సింహాచలంలో స్వామి వెలసాడు అని భక్తుల నమ్మకం. హిరణ్య కశిపుడుని వధించిన తరువాత స్వామి ఇక్కడ కొలువు తీరాడు అనంది పురాణేతిహాసాల సారం. దాంతో పాటు స్వామి నిజరూప దర్శనం అన్నది కూడా ఒక గొప్ప అనుభూతిగా భావిస్తారు. అందుకే ప్రతీ ఏడాది వైశాఖ శుద్ధ తదియ వేళ చందనోత్సవం నాడు స్వామి తన నిజ రూపం తో భక్తులను అలరిస్తారు. అది ఒక అపురూపమైన ఘట్టమని భక్తులు అంతా చెబుతారు. ఇక భక్తుల దర్శనాలు అన్నీ ఈ నెల 20వ తేదీ తెల్లవారుజామున 3 గంటల నుంచి ప్రారంభమవుతాయని అంతరాలయ దర్శనం ఉదయం 5 గంటల వరకు మాత్రమే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## పులివెందులలో గంజాయి, నాటుసారా విక్రయాలు.. 18 మంది అరెస్టు



**పులివెందుల, విశ్వం వాయిస్ న్యూస్ :** కడప జిల్లా పులివెందులలో గంజాయి, నాటుసారా విక్రయిస్తున్న 18 మందిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 15 కిలోల గంజాయి, 110 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు వివరాలను జిల్లా ఎస్పీ విశ్వనాథ్ మీడియాకు వెల్లడించారు. గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడిన వారిలో వివేకా హత్య కేసులో పలుమార్లు సీబీఐ విచారణ ఎదుర్కొన్న భరత్‌కుమార్ యాదవ్ కూడా ఉన్నాడు. వైకాపా హయాంలో తుపాకీ లైసెన్స్ కలిగి, ఒకరిని కాల్చి చంపిన కేసులో భరత్ నిందితుడు.

## కారు, బైక్ ఢీ.. ఎగిరిపడ్డ వ్యక్తి



**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఓ ద్విచక్రవాహనం, కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. సౌజన్య కల్యాణ మండపం వద్ద ఓ కారు వ్యతిరేక దిశలో వస్తుండగా.. ఓ వ్యక్తి బైక్‌పై వేగంగా రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న శ్రీనివాసులు అనే వ్యక్తి కొద్దిదూరం ఎగిరిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ప్రమాద దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తల్లిని ఇంట్లోనే ఉంచి నిప్పు పెట్టిన కుమారుడు



**ఒంగోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** కన్నతల్లిని ఇంట్లో ఉంచి నిప్పు పెట్టి హత్య చేసిన కుమారుడి ఉదంతం ఇది. ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికంగా ఉండే వెంకట రమణమ్మను కొడుకు కిషోర్ బాబు బతికుండగానే నిప్పు పెట్టి హతమార్చాడు. వెంకటరమణమ్మకు ఇద్దరు కొడుకులు. చిన్న కుమారుడు చెన్నైలో ఉద్యోగం చేస్తున్నాడు. పెద్ద కుమారుడు కిషోర్ బాబు తల్లితోనే ఉంటున్నాడు. అతడు మాంసం దుకాణం నిర్వహిస్తుంటాడు. మంగళవారం ఉదయం తల్లి నిద్రిస్తున్న సమయంలో ఇంటికి నిప్పుపెట్టాడు. ఇరుగుపొరుగు వచ్చి చూసేసరికి ఇంట్లో మంటలు చెలరేగి ఉండడంతో కిషోర్‌ను నిలదీశారు. సరైన సమాధానం ఇవ్వకుండా అక్కడి నుంచి పారిపోయాడు. అగ్నిమాపక అధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో మంటలను అదుపు చేశారు. అప్పటికే వెంకట రమణమ్మ మంటల్లో కాలి బూడిదయ్యింది. కిషోర్ బాబుకు మతిస్థిమితం సరిగా ఉండదని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆన్‌లైన్ వీడియో గేమ్స్ ద్వారా ఉగ్ర ఉచ్చులోకి..

### ఉగ్రమూలాల కేసులో నిందితులకు ముగిసిన కస్టడీ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆన్‌లైన్ వీడియో గేమ్స్ ద్వారా విదేశీ హ్యాండ్లర్లు యువతను ఉగ్ర ఉచ్చులోకి లాగి, వారిలో జిహాదీ భావజాలాన్ని నూరిపోసినట్లు ఉగ్రమూలాల కేసు నిందితుల విచారణలో తేలినట్లు తెలిసింది. తద్వారా వారు ఆత్మాహుతికి కూడా తెగబడేలా ప్రేరేపించినట్లు సమాచారం. ఒకరికొకరు అంతకుముందు ఏమాత్రం పరిచయం లేదు కదా? సామాజిక మాధ్యమాల్లో ఎలా కలిశారని నిందితులను పోలీసులు, సీఐ సెల్ అధికారులు ప్రశ్నించారు. నిందితుల ఐదు రోజుల కస్టడీ సోమవారంతో ముగిసింది. అనంతరం షాద్‌మాన్ దిల్‌ఖుష్, లక్కీ అహ్మద్, జిషాన్ అబ్దుల్ మజీద్, మిర్ ఆసిఫ్ అలీ, షారుక్‌ఖాన్, ఫయాజ్ ఉర్ రెహ్మాన్‌లకు ప్రభుత్వాసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించి, విజయవాడలోని సీఎంఎం కోర్టులో న్యాయాధికారి రాధారాణి ఎదుట హాజరుపరిచారు. కస్టడీలో నిందితులు వెల్లడించిన అంశాలతో కూడిన మధ్యవర్తుల నివేదికను కోర్టుకు సమర్పించారు. వీరిని రిమాండ్‌కు తరలించాలని న్యాయాధికారి ఆదేశించడంతో.. పోలీసులు బందోబస్తు మధ్య రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించారు.

**ఫ్రీఫైర్ గేమ్ ద్వారా పరిచయం**

'నిందితులు ఫ్రీ ఫైర్ గేమ్ ఆడేవాళ్లు. ఆ ఐడీల ద్వారా విదేశీ హ్యాండ్లర్లు వీరికి గాలం వేశారు. ఈ గేమ్‌లో తదుపరి లెవెల్‌కు వెళ్లేందుకు చందాను విదేశీ హ్యాండ్లర్లు చెల్లించేవారు. ఇలా నెమ్మదిగా వారిని ఉచ్చులోకి లాగిన తర్వాత తీవ్రవాద భావజాలాన్ని ప్రేరేపించారు. భారత్‌లో ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పాటు చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఫ్రీ ఫైర్ గేమ్ ద్వారా పరిచయమైన వీరంతా తరచూ ఇన్‌స్టాలో వేర్వేరు ఐడీలతో సంభాషించుకునేవారు. విదేశీ హ్యాండ్లర్ షకూర్ వీరిని రెచ్చగొట్టేవాడు. దిల్లీకి చెందిన లక్కీ అహ్మద్ బెనెక్స్ గ్రూప్ ఏర్పాటు చేసి.. మిగిలిన వారందరినీ కలిపాడు. లక్కీ అహ్మద్‌తో పాటు, విజయవాడకు చెందిన రహంతుల్లా సామాజిక మాధ్యమాల్లో ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో, పలువురిని ఇందులోకి ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించారు' అని విచారణలో వెల్లడైనట్లు తెలిసింది.

## గడప కడగడానికి వెళ్లొస్తూ కడపటి ప్రయాణం

### తమ్ముడి ఇంటి నుంచి వస్తుండగా అక్క కుటుంబానికి ప్రమాదం
### స్కూటీని లారీ ఢీకొట్టడంతో ముగ్గురి దుర్మరణం



**తాండూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మరో రెండు వారాల్లో ఆ కుటుంబంలోని పెళ్లి పనుల్లో అక్కాబావలుగా తలమునకయ్యేవారు. మేనకోడలు, మేనల్లుడి అల్లరితో ఆ ఇంట సందడి నెలకొనేది. కానీ విధిరాత మరోలా ఉంది. తమ్ముడి పెళ్లి కళ్లారా చూడకుండానే ఆ అక్క, ఆమె భర్త, ఆమె కుమార్తె రోడ్డుప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఈ విషాద ఘటన వికారాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. పెద్దేముల్ ఎస్సై ప్రశాంత్‌వర్ధన్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుక్మాపూరుకు చెందిన పావని(35)కి సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం శాంతినగర్‌కు చెందిన కవిరాజ్(40)తో 13ఏళ్ల కిందట వివాహమైంది. వారికి కార్తీక్(10), కీర్తన(7) సంతానం. ఈమధ్యే పావని సోదరుడికి వివాహం నిశ్చయమైంది. మే 1న పెళ్లి. ఆడపడుచు గడప కడగాల్సిన సంప్రదాయం ఉండడంతో పావని.. భర్త, పిల్లలతో కలిసి ఆదివారం సాయంత్రం స్కూటీపై రుక్మాపూరుకు వెళ్లారు. గడప కడిగే ప్రక్రియ పూర్తయ్యాక.. తాండూరులోని భద్రేశ్వర ఉత్సవాలకు వెళ్లొచ్చారు. రాత్రికి అక్కడే ఉండి.. సోమవారం ఉదయం 5 గంటలకు నలుగురూ స్కూటీపై జహీరాబాద్‌కు బయలుదేరారు. పెద్దేముల్ మండలం తట్టేపల్లి శివారులోకి రాగానే జహీరాబాద్ నుంచి తాండూరుకు నాపరాయి లోడ్ కోసం వేగంగా వెళ్తున్న లారీ... స్కూటీని బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కార్తీక్‌కి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. లారీడ్రైవర్ మహ్మద్ షరీఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## బైక్‌తో సహా కాలువలో పడి తల్లీ తనయుల మృతి

### ఎవరూ చూడక అరగంట పాటు మురుగు నీళ్లు మింగిన వైనం



**కాకినాడ (సర్పవరం), విశ్వం వాయిస్ న్యూస్ :** ద్విచక్ర వాహనంపై ఆసుపత్రికి వటటళుండగా అదుపుతప్పి మురుగు కాలువలో పడిన ఘటన లో సోమవారం తల్లీకుమారులు మృతిచెందారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడకు చెందిన దాసరి సత్యనారాయణ భార్య లక్ష్మి(50)కి భుజం నొప్పిగా ఉందని చెప్పడంతో.. కుమారుడు దుర్గాగణపతి (28) ఆమెను తీసుకుని ద్విచక్రవాహనంపై కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రికి బయలుదేరారు. కాకినాడలోని రమణయ్యపేట వద్ద సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి వాహనం అదుపుతప్పి తల్లీకుమారులు వాహనంతో పాటు మురుగు కాలువలో పడిపోయారు. సుమారు అరగంట సేపు ఎవరూ వారిని చూడకపోవడంతో మురుగు నీళ్లు మింగేశారు. తర్వాత స్థానికులు గమనించి వారిని బయటకు తీసి చిత్రాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారు. సర్పవరం ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిమ్ ట్రైనర్‌కు వలపు వంచన

### ఆస్తులు రాసివ్వాలన్న వివాహిత - వేధింపులు తాళలేక యువకుడి ఆత్మహత్య

**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** జిమ్‌కు వస్తున్న వివాహిత (42) తనను వేధిస్తోందని, బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపిస్తూ దిలీప్ (28) అనే జిమ్ ట్రైనర్ ఆత్మహత్య చేసుకున్నారు. బెంగళూరు శివారు నెలమంగళ సమీప వాజరహళ్లికి చెందిన దిలీప్.. ఇద్దరు పిల్లలున్న వివాహిత జిమ్‌కు వచ్చినప్పుడు ఆమెకు వ్యక్తిగత శిక్షకుడిగా సేవలందించారు. ఆ పరిచయం వివాహేతర సంబంధంగా మారినట్లు సమాచారం. విషయం ఆ గృహిణి ఇంట్లో తెలిసినప్పటి నుంచి గొడవ పెద్దదైంది. స్థానిక ఠాణాలో ఏడాది కిందట రాజీ పంచాయితీ చేశారు. అనంతరం దిలీప్ ఆమెకు దూరంగా ఉంటూ వచ్చారు. "తన కుమారుడి పేరిట ఇంటిని రాయాలంటూ గృహిణి బెదిరిస్తూ వచ్చింది. సహజీవనం చేయాలని వేధించింది. ఈ వేధింపులు తట్టుకోలేక నా కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు" అని దిలీప్ తండ్రి రమేశ్ ఆరోపించారు. ఆత్మహత్యకు ముందు ఆమెకు ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు బాధితుడు చెప్పినట్లు నెలమంగళ ఠాణా పోలీసులు సోమవారం గుర్తించారు. దిలీప్ గతంలో బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొని అనేక పతకాలు సాధించారు.

## భారతరత్న అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

### నివాళులర్పించిన డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మార్గాని నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ హక్కులు అందుకునేలా ప్రతీ ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజక ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం నగర అధ్యక్షులు తిరగాటి దుర్గా, పలు డివిజన్ల ఇన్చార్జిల ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మహనీయుని జయంతి వేడుకలు మంగళవారం రాజమండ్రి నగరంలో ఘనంగా నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమాలు చీరల పంపిణీ వైద్య శిబిరాలు తో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని పండగల నిర్వహించారు. భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజక వర్గ ఇంచార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, బీసీ సంఘాల జేఏసీ ఉభయ రాష్ట్రాల అధ్యక్షులు మార్గాన్ని నాగేశ్వరరావు మాజీ శాసనసభ్యులు రౌతు సూర్య ప్రకాశరావు, దాసి వెంకట్రావు, కాటం రజనీకాంత్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మార్త లక్ష్మి ముఖ్య అతిథులుగా పాల్గొని ఘన నివాళి అర్పించారు. రాజమండ్రి గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. బీసీ జేఏసీ ఉభయ రాష్ట్రాల అధ్యక్షులు మార్గాని నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి భారత రాజ్యాంగంలోని సమాన హక్కులు కల్పించారని తెలిపారు. మాజీ శాసనసభ్యులు రౌతు సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన దేశానికి అందించిన విలువైన సేవలను స్మరించుకుంటోందని అన్నారు. ముందుగా స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నగర ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు తిరగటి దుర్గ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నాయకులు ఘన నివాళులర్పించారు. స్థానిక సారంగధర మెట్ట వద్ద మెడికల్ క్యాంప్, చీరల పంపిణీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సుబ్బారావు పేట, క్వారీ మార్కెట్ వద్ద అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలు వేసి ఘన నివాళి అర్పించారు. విశేష పురంలో కొల్లి వినయ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతోత్సవం జరిగింది. అంబేద్కర్ మహనీయుని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు అనంతరం చీరలు పంపిణీ జరిగింది. స్థానిక 50వ వార్డులోనూ, లాలాచెరువు జంక్షన్ లోనూ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐదవ డివిజన్ కంబాలచెరువు హైటెక్ బస్సు షెల్టర్ వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైల్డ్ పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి, దాసి వెంకట్రావు, కాటం రజనీకాంత్, బిల్డర్ చిన్న, చంటిబాబు,గారా చంటిబాబు, పీతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 14వ వార్డులో అంబేద్కర్ జయంతి భారీ బైక్ ర్యాలీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ శిల్పి, మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని రాజమహేంద్రవరం నగరంలోని 14వ వార్డులో ఘనంగా ర్యాలీ నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి, ఈతలపాటి రవి ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. జయంతి వేడుకలు ముగ్గపేట సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం ద్వారా ప్రారంభమయ్యాయి. అనంతరం అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా చాటుతూ భారీ ర్యాలీగా గోకవరం బస్టాండ్ వరకు చేరుకుని అక్కడి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి, ఈతలపాటి రవి మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన కృషి ప్రతి భారతీయుడికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గం నేటి సమాజ నిర్మాణానికి మార్గదర్శకమని, యువత ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. జయంతి సందర్భంగా మహిళలు, వృద్ధులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించి సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లో మరింత విస్తరించేందుకు కృషి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాన్ సూరి, ఎర్రంశెట్టి రాజ్ కుమార్, ఎస్.కె రబ్బాని, ఉండవల్లి నాగేశ్వరరావు, ముత్యాలు కృష్ణ, షేక్ అబ్దుల్లా, దుర్గారావు తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. మొత్తంగా 14వ వార్డులో నిర్వహించిన ఈ అంబేద్కర్ జయంతి ర్యాలీ నగరంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లో మరింత బలంగా ప్రతిధ్వనింపజేసింది.

## మహా ప్రస్తానం అంబులెన్స్ తక్షణమే ఏర్పాటు చేయాలి - ఏపీ ఆదివాసీ జేఏసీ డిమాండ్



**రంపచోడవరం, నేటి వార్త :** పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, రంపచోడవరం కేంద్రంగా జిల్లా కార్యాలయాలు అన్ని ఏర్పాటు చేస్తున్నప్పటికీ జిల్లా కేంద్రంలో ఎప్పటినుండో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు మహాప్రస్థానం అంబులెన్స్ లు ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరం అని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....రంపచోడవరం కేంద్రంగా ఉన్న పోలవరం జిల్లా కార్యాలయాలకు,ఆసుపత్రులకు మన్యం ప్రాంతంలోని మారుమూల గ్రామాల నుండి జిల్లా కార్యాలయాలకు చేరుకోవాలంటే ఆదివాసీ ప్రజలు జీవించే గ్రామాలకు నేటికీ బీటీ రోడ్డు సౌకర్యం లేదు.మరోవైపు అంబులెన్సు మా గ్రామాలకు రావు. ఇంకవైపు మన రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించింది.కానీ ఏజెన్సీ మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం ఉదయం,మధ్యాహ్నం మరియు సాయంత్రం మూడు పూట్ల ఏర్పాటు చేయకపోవడం అంటే ఆదివాసీలపై వివక్ష చూపించడమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమా అని ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆదివాసీ ప్రజలు జీవించే హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు.యుద్ధ ప్రాతిపదికన పోలవరం జిల్లా రంపచోడవరం కేంద్రంగా ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి మహాప్రస్థానం అంబులెన్స్ లు ఏర్పాటు చేయాలి.అలాగే ఏజెన్సీ మారుమూల గ్రామాలకు బీటీ రోడ్లు తక్షణమే నిర్మించారు.ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో అంబులెన్సు సౌకర్యం ఏర్పాటు చేయాలి.రంపచోడవరం కేంద్రంగా ఏపీఎస్ ఆర్టీసీ డిపో తక్షణమే ఏర్పాటు చేసి ఏజెన్సీ మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం మూడు పూట్ల వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర నాయకులు కారం రామన్న దొర,యలగాడ నాగేశ్వరరావు,గంపా నాగరాజు,వేట్ల సరస్వతి, కోసూరి రాజారెడ్డి రెడ్డి, అందాల లింగారెడ్డి, గుమ్మడి లోవ ప్రసాద్,ఈ పూరి వెంకటరమణ,ముర్ల వెంకటేష్ రెడ్డి,తాటి వెంకన్న దొర తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటిన జన్మదినం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో చింతలూరులో వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు, ఆపార్టీ రాష్ట్ర అసెంబ్లీ బూత్ కమిటీ అధ్యక్షులు, కొత్తపేట నియోజక వర్గ డిజిటల్ మేనేజర్, మాజీ ఏజిపి నామాల శ్రీనివాస్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో వినూత్నంగా నిర్వహించారు. చింతలూరు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో నూకాంబిక అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు, వాహనదారులు, బాటసారులకు స్వయంగా మజ్జిగ అందజేస్తూ ఆయన మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఎండకాలంలో ఇలాంటి సేవలు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. స్థానికులు కూడా శ్రీనివాస్ సేవా తత్వాన్ని ప్రశంసిస్తూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతలూరు వైసిపి నాయకులు మార్గాన్ని ఏసు, నూకపెయ్య సూరిబాబు, అత్తిలి ప్రసాద్ (బుల్లి), వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షులు ఈదర తేజ సురేంద్ర చౌదరి, సంధిపూడి వైసిపి పార్టీ ప్రెసిడెంట్ తోట గోవిందు, ఏడిద మెహర్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆలోచన విధానమే దేశానికి దిశానిర్దేశం



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల ప్రజా పరిషత్ కాట్రేనికోన, మరియు కాట్రేనికోన, పల్లంకుర్రు చెయ్యేరు గ్రామ పంచాయతీల్లో ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచన విధానమే దేశానికి దిశానిర్దేశంగా అభివర్ణించారు, జాతీయ నాయకుల మార్గదర్శకత్వంలో యావత్ సమాజం నడుచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. సదరు కార్యక్రమాల్లో మండల పరిషత్ అధ్యక్షులు, ఆయా పంచాయతీల ప్రజాప్రతినిధులు, పెద్దలు, పంచాయతీ కార్యదర్శులు స్వర్ణ గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదర్శనీయుడు అంబేద్కర్ : సిఐ మోహన్



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆదర్శనీయుడనే ముమ్మిడివరం సర్కిల్ ఇన్స్పెక్టర్ మోహన్ కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బొజ్జ వారి పేటలో మంగళవారం నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు ఆయన ప్రారంభించారు. అదేవిధంగా గ్రామస్తులు విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన పుస్తకాలను కూడా పంపిణీ చేశారు. ఇదేవిధంగా ప్రతి గ్రామంలో యువత ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఎంపీడీవో రాజేశ్వరరావు, తాసిల్దార్ కార్యాలయం వద్దతాసిల్దార్ రవి కిరణ్, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ అవినాష్అంబేద్కర్ కు ఘన నివాళులర్పించారు. ప్రతి గ్రామంలో వాడ వాడలా అంబేద్కర్ జయంతి ఉత్సవాలనుఘనంగా నిర్వహించారు.

**అంబేద్కర్ ఆశయ సాధనకు**

## ఐక్యతతో కృషిచేయాలి

**సోంపల్లి ఇంద్ర కాలనీలో ఘనంగా అంబేద్కర్ జయంతి ఉత్సవం**



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత, భారత దేశ నవనిర్మాణకుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకోసం అంతా ఐక్యతతో కృషిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆయన కేవలం ఒక్క దళిత, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికే కాకుండా మహిళలు, కార్మికులు ఇలా అన్ని వర్గాల్లోని ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషిచేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని రాజోలు మండలం సోంపల్లి ఇంద్ర కాలనీ గ్రామంలోని ఘనంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ బాబా సాహేబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ గురించి మాట్లాడుతూ సమాజంలో మనుషులందరికీ సమానహక్కు, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం లభించాయంటే అంబేద్కర్ తన భారత రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులేనని, కేవలం దళిత వర్గాల కోసం, రిజర్వేషన్లు కల్పించడంకోసమే అంబేద్కర్ కృషి చేశారనుకుంటే పొరబడినట్లేనని, కానీ సమాజంలో అన్ని సామాజికవర్గాల్లో ఉన్న పీడిత వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషిచేసిన ఘనత అంబేద్కర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మరిరు తదితరులు పాల్గొన్నారు.

**వెంకమ్మచెరువు గ్రామం నందు**

## అంబేద్కర్ జయంతి వేడుకలు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన మండలం, వెంకమ్మచెరువు గ్రామం నందు, ఎమ్మార్పీఎస్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు నిర్వహించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేచి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, బడుగు శ్రీను, సవరపు రాజు, చెల్లూరి బాలకృష్ణ, ఉందుర్తి దేవానందం, తోత్తరమూడి శ్రీనివాసరావు, చెల్లూరి నాగరాజు, కొల్లి లోవరాజు, కొడమంచిలి బుజ్జిబాబు, చెల్లూరు బాలు, ఉందుర్తి కృష్ణ, ఉందుర్తి రాజు, దార్ల సూర్యారావు, చెల్లూరి నాగు, కొడమంచిలి సహదేవుడు, చెల్లూరి సురేష్, నరేష్, దార్ల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలకు 'కంబాల' భారీ సహాయం

**అంబేద్కర్ సాక్షిగా..కబడ్డీ రణం: - ఆర్ట్స్ కళాశాలలో హోరాహోరీగా సాగిన రాష్ట్ర స్థాయి సమరం**
**- నిర్వహణ కోసం రూ. 1.50 లక్షల భారీ ఆర్థిక సాయం ప్రకటించిన కంబాల శ్రీనివాసరావు**
**- మెరుపులు మెరిపించిన 85 మంది క్రీడాకారులకు అదనంగా ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు**
**విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ పంపిణీతో మిన్నంటిన క్రీడాకారుల ఉత్సాహం - యువతలో సామాజిక చైతన్యం, క్రీడా స్ఫూర్తి నింపడమే లక్ష్యమన్న నిర్వాహకులు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు రాజమహేంద్రవరం వేదికగా క్రీడా శోభను సంతరించుకున్నాయి. స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. సోమవారం రాత్రి జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జట్లు అమీతుమీ తేల్చుకోగా, గెలుపొందిన విజేతలకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. అంతకుముందు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన ఆయన, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొంతల సురేష్‌తో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. మైదానానికి చేరుకున్న కంబాల శ్రీనివాసరావుకు నిర్వాహక కమిటీ ఘనంగా స్వాగతం పలికింది. క్రీడల పట్ల అంకితభావం, యువతకు అండగా నిలవాలన్న సంకల్పంతో కంబాల శ్రీనివాసరావు ఈ టోర్నమెంట్ విజయవంతం కావడానికి రూ. 1.50 లక్షల భారీ విరాళాన్ని అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. కేవలం విజేతలకే కాకుండా, క్రీడా మైదానంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 85 మంది క్రీడాకారులను ప్రత్యేకంగా గుర్తించి, వారికి ఒక్కొక్కరికి రూ. 1,000 చొప్పున మొత్తం రూ. 85 వేల నగదును ప్రోత్సాహకంగా పంపిణీ చేశారు. గెలుపొందిన జట్లకు ట్రోఫీలు, మెడల్స్‌తో పాటు ప్రైజ్ మనీని అందజేస్తూ, యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో అవసరమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ క్రీడాకారులకు తన వంతు సహకారం నిరంతరం కొనసాగుతుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు, రామసేన సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొని క్రీడాకా రులను ఉత్సాహపరిచారు.

# గుండెపోటుతో కాంట్రాక్టు లెక్చరర్ మృతి

**బ్యాంకులోని కుప్పకూలిన గణిత శాస్త్ర అధ్యాపకుడు - వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 20 ఏళ్లుకు పైగా సేవలు**
**అధ్యాపకుడు రమేష్ బాబు మృతికి పలువురు సంతాపం - ఓ మధ్యతరగతి కుటుంబంలో మిగిల్చిన అంతులేని విషాదం**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాలం ఆయన లెక్కల మాస్టారు. వందలాది మంది విద్యార్థుల జీవితాల్లోని చిక్కుముడులను విప్పి, వారి భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసిన విద్యాదాత. కానీ, ఆయన జీవితపు లెక్కను మాత్రం అర్ధాంతరంగా ముగించేసింది. రెండు దశాబ్దాల సుదీర్ఘ బోధనా ప్రస్థానం.. మధ్యతరగతి కష్టాలు.. కుటుంబ బాధ్యతలు.. వెరసి ఒక నిబద్ధత గల అధ్యాపకుడి ప్రయాణం బ్యాంకు కుర్చీలోనే ఆగిపోయింది. రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల గణిత అధ్యాపకుడు కట్టా రమేష్ బాబు (45) ఆకస్మిక మృతి విద్యాశాఖలో తీరని శోకాన్ని నింపింది.

**విధి ఆడిన వింత నాటకం.. గంట వ్యవధిలోనే మృత్యువు కౌగిలిలోకి..**

సోమవారం ఉదయం ఎప్పటిలాగే చిరునవ్వుతో కళాశాలకు వచ్చిన రమేష్ బాబు, మధ్యాహ్నం 12:30 వరకు విద్యార్థులకు పాఠాలు చెప్పారు. తోటి అధ్యాపకులతో కలిసి సరదాగా గడిపారు. కళాశాల ముగిసిన తర్వాత వ్యక్తిగత పనిపై కెనరా బ్యాంకుకు వెళ్లారు. కానీ, అప్పటి వరకు తమ మధ్యే ఉన్న మనిషి, గంట వ్యవధిలోనే శవమై కనిపిస్తాడని ఎవరూ ఊహించలేదు. బ్యాంకులో పని కోసం వేచి చూస్తూ కుర్చీలో కూర్చున్న ఆయన, ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకూలిపోయారు. బ్యాంకు సిబ్బంది వెంటనే స్పందించి సిపిఆర్ చేసినప్పటికీ, మృత్యువు అప్పటికే ఆయనను తన ఖాతాలో వేసుకుంది.

**వెంటాడిన కష్టాలు.. తల్లి జ్ఞాపకాలు..**

రమేష్ బాబు జీవితం ఇటీవలి కాలంలో ఒడిదుడుకుల మధ్య సాగుతోంది. గతేడాది తల్లి మరణం ఆయనను మానసికంగా కుంగదీసింది. అదే సమయంలో కుటుంబ ఖర్చుల అవసరాలు నిమిత్తం కెనరా బ్యాంకులో బంగారం కుదువ పెట్టి రుణం తీసుకున్నారు. ఆ లోన్ రెన్యువల్ చేసుకోవాలని బ్యాంకు నుంచి వరుస ఫోన్లు వస్తుండటంతో, ఆ ఒత్తిడిలోనే ఆయన బ్యాంకుకు వెళ్లారు. అప్పు తీర్చి తన బాధ్యత నెరవేర్చుకోవాలనుకున్న ఆ ప్రయత్నమే ఆయన చివరి ప్రయాణమైంది. అతని మెడలో ఉన్న ఐడి కార్డ్ ఆధారంగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా బ్యాంకు సిబ్బంది గుర్తించారు. వెను వెంటనే కళాశాలకు వెళ్లిన కెనరా బ్యాంకుకు సంబంధించిన ఉద్యోగులు, కళాశాల సిబ్బందికి సమాచారం అందించారు. ఇదే విషయాన్ని, కుటుంబ సభ్యులకు చేరవేశారు. రెండు దశాబ్దాల నిరంతర సేవ.. యానాం సమీపంలోని తాళ్లరేవు ఇతని స్వస్థలం., గత 20 ఏళ్లుగా కాంట్రాక్ట్ లెక్చరర్గా విద్యారంగానికి సేవలు విశేష అందించారు. కాజులూరు, ఆలమూరు, మండపేట, మురమండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గతంలో సేవలందించారు.



ప్రస్తుతం రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్నారు. వేలాది మంది గ్రామీణ విద్యార్థులకు గణితంపై మక్కువ కలిగించి, వారి ఉన్నతికి తోడ్పడ్డారు. కాంట్రాక్ట్ ఉద్యోగి అయినప్పటికీ, ప్రభుత్వ కళాశాల ప్రగతి, విద్యార్థుల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించేవారని సహచరులు గుర్తుచేసుకున్నారు.

**కన్నీరు మున్నీరైన కుటుంబం..**

రమేష్ బాబు మృతితో ఆయన కుటుంబంలో అంతులేని విషాదం మిగిల్చింది.. భార్య, ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న కుమార్తె ఆయనపైనే ఆధారపడి ఉన్నారు."ఇక మాకు దిక్కు ఎవరు? మా భవిష్యత్తు ఏమిటి?" అంటూ వారు పెట్టిన రోదనలు బ్యాంకు ఆవరణలో ఉన్న ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి. మెడలో ఉన్న కాలేజీ ఐడి కార్డును చూసి సిబ్బంది ఆయనను ఇంటర్ విద్యకు చెందిన జూనియర్ లెక్చరర్ గుర్తించారు.

**పలువురు దిగ్భ్రాంతి..**

సౌమ్యుడు, అందరితో కలుపుగోలుగా ఉండే రమేష్ బాబు మృతి పట్ల రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు సిబ్బంది ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కేవలం ఒక అధ్యాపకుడిని మాత్రమే కాకుండా, తమ కుటుంబ సభ్యుడిని కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సాయంత్రం 7 గంటలకు ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన తాళ్లరేవుకు తరలించారు. ఒక సామాన్య కాంట్రాక్ట్ అధ్యాపకుడి జీవితం ఆర్థిక ఇబ్బందుల సుడిగుండంలో, పని ఒత్తిడిలో ఎలా అర్ధాంతరంగా ముగిసిపోతుందో ఘటన మరోసారి నిరూపించింది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని,ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కాంట్రాక్టు లెక్చరర్స్ సంఘం ప్రతినిధులు కోరారు.

# గెల్లా కేశవకు బి.ఆర్ అంబేద్కర్ ఫెలోషిప్‌తో సత్కారం

**- సమ భావనతోనే సమాజహితం**

**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాత్మా జ్యోతిభా పూలే, అంబేద్కర్, బుద్ధుడు సామాజిక విముక్తి ప్రదాతలని కాకినాడ జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్కే ప్రసాద్ అన్నారు.జీకే ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ గెల్లా కేశవ వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించినందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు అందించారు. జెఎన్టీయూ కాకినాడ ప్రాంగణంలో మంగళవారం ఉదయం మహా ఆత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి ర్ :అంబేద్కర్ జయంతుల సందర్భంగా పాన్ ఇండియన్ అసోసియేషన్ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షులు రాజా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంలో కుల వివక్ష, అజ్ఞానం, స్త్రీ బానిసత్వానికి వ్యతిరేకంగా సాగిన తొలి పోరాటాలలో పూలే దంపతులది అగ్రస్థానం అన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన సత్కళా వాహిని వ్యవస్థాపకులు ఇ.వి. కృష్ణమాచార్యులు మాట్లాడుతూ పూలే దంపతులు, డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ చీకటి కాలంలో విజ్ఞాన జ్యోతులను వెలిగించి అణగారిన వర్గాల సమానత్వం కోసం కృషి చేశారన్నారు. సామాజిక వేత్త డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ, విద్య వారి త్యాగఫలమే అని, వారి ఆశయాలు స్ఫూర్తితోనే భారత దేశం ముందుకెళ్తుందని కొనియాడారు. హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జిల్లా కోర్డినేటర్



డాక్టర్ తురగా సూర్యారావు మాట్లాడుతూ, ప్రపంచీకరణ కాలంలో కేవలం లాభాపేక్ష కలిగిన యంత్రాల్లా కాకుండా, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులుగా ఎదగడమే వారికి మనం ఇచ్చే అసలైన నివాళి అప్పుడే మనం నిజమైన వారసులమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్య,వేద గెల్లా కేశవ వారికీ పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించినందుకు గాను జీకే ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ గెల్లా కేశవ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అవార్డును యూనివర్సిటీ ఎగ్జామ్స్ లో చేతుల మీద అవార్డు ఇచ్చి సత్కరించారు ఈకార్యక్రమంలో సామాజిక ఉద్యమనేతలు డాక్టర్ బి.వి. రాజు, యడ్ల కుటుంబరావు, సామాజిక వేత్తలు డాక్టర్ చల్లగాని సతీష్ కుమార్, డాక్టర్ కట్టుంగ సీతా రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# రాజమహేంద్రిలో అంబేద్కర్‌కు ఘన నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాజ మహేంద్రి మహిళా డిగ్రీ అండ్ పీ.జీ కళాశాల ఆధ్వర్యంలో అంబేద్కర్ కు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక రాజమహేంద్రి మహిళా డిగ్రీ మరియు పీ.జీ కళాశాల లో భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా, అంబేద్కర్ కళాశాల లైబ్రరీలో చిత్రపటానికి కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.కె.ఎస్. ప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.కే.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ, బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగం వల్లనే భారతదేశంలో అన్ని మతాలు, కులాలు, దళిత, బడుగు, బలహీన, అనగారిన వర్గాల ప్రజలు సుఖశాంతులతో జీవనం సాగిస్తున్నారని అన్నారు. అసలు అంబేద్కర్‌ని ఏ ఒక్క కులానికో, మతానికో ఆపాదించడం సరికాదు అని అన్నారు. ఆయన అందరినీ సమభావంతో చూడాలని కోరుకునే వారీది అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్. ఎన్.ఎస్. పి.ఓ. దంటు వీర వెంకట్రావు, కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు మరియు అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్**


## ఆశయ సాధనకు కృషి చేయాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క 135వ జయంతి ఉత్సవాలు తూర్పుగోదావరి జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు రెవ. ఎం.విజయ సారథి ఆధ్వర్యంలో జిల్లాలో ఘనంగా నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని మండలాలను కలుపుకుంటూ ఈరోజు తూర్పుగోదావరి జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర జిల్లా నాయకులు పర్యటించారు. ఉదయం రాజమండ్రి అర్బన్ నియోజకవర్గంలో ప్రారంభమై ఏడు నియోజకవర్గాలలోను ఉన్న 19 మండల కేంద్రంలో ఉన్న ఆయా మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటల వరకు ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు రెవ. విజయసారథి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యొక్క ఆశయ సాధనకు కృషి చేయాలని ప్రతి చోటా ప్రజలకు తెలియజేశారు. ప్రతి బలహీన బడుగు వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసి ఆయన ఎన్నో డిగ్రీలు సంపాదించి ఒక మానవుడు తలుచుకుంటే ఎంతైనా చదవగలడని మేధాశక్తిని సంపాదించుకొనగలడని నిరూపించిన ఏకైక నాయకుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రెవ. షిమ్మీ, రెవ. కల్వరి కుమార్, పిట్ట డానియల్, కరుణాకర్, ఐజాక్, బుజ్జి బాబు, జోషి, ఆనంద్ విజయకుమార్, నవీన్ కుమార్, సురేష్, హస్కనాజ్, టీజె కర్నేలి, పిట్ట జేసు కుమార్ ఇంకా అనేకమంది క్రైస్తవ నాయకులు వైఎస్ఆర్సిపి అభిమానులు పాల్గొని ప్రతి చోటా కార్యక్రమాలను జయప్రదం చేశారు.

## బడుగు బలహీన వర్గాల మార్గదర్శి అంబేద్కర్

**అంబేద్కర్ ఆశయ సాధన యువత మరువకూడదు : రొటేరియన్ తీగల రాజా**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దాదాసాహెబ్ అంబేద్కర్ 135 జయంతి పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్,మంగళవారం ఉదయం అజాద్ చౌక్ జాంపేట నందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. ఈ సందర్భంగా చాప్టర్ ప్రెసిడెంట్ రొటేరియన్ తీగలరాజా మాట్లాడుతూ, నిమ్మన జాతుల ఆశాజ్యోతి బడుగు బలహీన వర్గాల మార్గదర్శి భారత రాజ్యాంగ దిక్సూచి అయినటువంటి బాబాసాహెబ్‌ని నేటి యువత మరువకుండా ఆయన ఆశయ సాధనకు పాటుపడాలని సమ సమాజ నిర్మాణానికి పాటుపడాలని కుల వివక్షతను వీడనాడాలని అభివృద్ధి మన అందరి బాటగా ముందుకు వెళ్లాలని తెలిపినారు ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ రొటేరియన్ మండవెల్లి వెంకన్న బాబు క్లబ్ ట్రెజరర్ రొటీరియన్ షేక్ దావూద్ ఇబ్రహీం, జాయింట్ సెక్రెటరీ రొటేరియన్ నవీన్ ప్రసాద్, సామ్రాజ్య ఈ డి రొటీరియన్ గ్రంధి రాజా, యువరాజ్ ఫైనాన్స్ డైరెక్టర్ జల్లు బాబి,ఈదుపుగంటి రామకృష్ణ చౌదరి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కొండబాబు, యువజన సంఘ సభ్యులు పాల్గొని కేక్ కటింగ్ చేసి విచ్చేసిన అందరికీ పంచినారు. ఈ సందర్భంగా రోటరీ ఐకాన్స్ వారు భారీ ఎత్తున విందు ఏర్పాటు చేసినారు.

## జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు ఘన నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఉదయం స్థానిక గోకవరం బస్టాండు అంబేద్కర్ విగ్రహం దగ్గర 135వ జయంతి సందర్భం గా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బోడా వెంకట్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. బోడా వెంకట్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ అంబేద్కర్ దేశానికీ ఆయన చేసిన సేవలు,రాజ్యాంగ విలువలు కొరకు కొనియాడారు. బడుగు బలహీన వర్గాలకు గురించి గొప్ప పనులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ జనరల్ సెక్రెటరీ పట్నాల శ్రీనివాస్, యాళ్ల మాచరయ్య,మోర్త అబ్బులు, జె.టి రామారావు, శెట్టి ప్రతాప్, కాపు చెన్న వీరభద్రరావు, ఇజ్జరోతు సత్యనారాయణ, చెంతడ వెంకటేశ్వరరావు, చామర్తి లీలావతి,సి.వి. ప్రసాద్, కేవి.ఆనంద కుమార్.బి. అనిత ముకేశ్, సంతోష్, శివ, ఎన్ ఎస్ యు ఐ తారాకేష్ తిరుమల, దొర,జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




హసన్ బాదలో ఘనంగా

# అంబేద్కర్ జయంతి వేడుకలు

## నివాళులర్పించిన ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్



**రామచంద్రపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** నేడు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా హసన్ బాద గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, రామచంద్రపురం వైసీపీ ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహనీయుడు బాబాసాహెబ్ అని కొనియాడారు. రాజ్యాంగం ద్వారా ఆయన కల్పించిన సమాన హక్కులు, సమాజంలో స్వేచ్ఛ మరియు సోదరభావం పెంపొందించడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదని, అంబేద్కర్ జీవితం నేటి యువతకు గొప్ప స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలతో కలిసి జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొని అంబేద్కర్ సేవలను స్మరించుకున్నారు.

# అంబేద్కర్ సిద్ధాంతాలు యువతకు ఆదర్శం




**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బాబా సాహెబ్ భీమ్ రావ్ అంబేద్కర్ సిద్ధాంతాలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని జిల్లా వైసిపి అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని ఈతకోట పరిధిలో గల లిదియా ఫార్మసీ కళాశాలలో కళాశాల సెక్రటరీ గొల్లపల్లి శ్రీధర్ అధ్యక్షతన జరిగిన భారత రాజ్యాంగ నిర్మాత జయంతి వేడుకల్లో విశిష్ట అతిథులుగా మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు,అతిథులుగా వైసిపి నాయకులు కర్రి అశోక్ రెడ్డి,జవ్వాది రవి హాజరయ్యారు.ముందుగా మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి,మాజీ మంత్రి సూర్యారావు అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచనలు సమాజంలో సమానత్వం, న్యాయం, విద్యా ప్రాముఖ్యతను పెంపొందించడానికి ఎంతో అవసరమన్నారు.ఆయన సిద్ధాంతాలు నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తాయని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కళాశాల యాజమాన్యం కూడా విద్యార్థులు అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.అంబేద్కర్ జీవిత చరిత్రపై ప్రసంగాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సబ్బితి మోహన్ రావు, కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ పి.రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మనోహర్ బాబు, అధ్యాపకులు, అధికసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# చింతపల్లి వీరభద్రరావు కన్నుమూత

## పాడె మోసి నివాళులర్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ హాసనబాధకు చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు చింతపల్లి వీరభద్రరావు మృతి చెందడం పట్ల నియోజకవర్గంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే పలువురు రాజకీయ ప్రముఖులు తరలివచ్చి నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, తోట పృథ్వీరాజు, పిల్లి సూర్య ప్రకాష్ వీరభద్రరావు భౌతిక కాయాన్ని సందర్శించి, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. కాగా, రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ గారు అంత్యక్రియల్లో పాల్గొని వీరభద్రరావు పాడె మోసి తన నిరాడంబరతను చాటుకోవడమే కాకుండా, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రజా సేవలో వీరభద్రరావు చేసిన కృషి చిరస్మరణీయమని, వారి మరణం జిల్లా రాజకీయాలకు తీరని లోటు అని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు.

ఎదురెదురుగా రెండు మోటార్ సైకిల్‌లు ఢీ కొని

# యువకుడు మృతి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల్లో భాగంగా అంబాజీపేట మార్కెట్ యార్డ్ సమీపంలో జరుగుతున్న ద్విచక్ర వాహనాల ర్యాలీలో అపశృతి చోటుచేసుకుంది. మృతుడు ముత్తాబత్తుల నాగేంద్ర బాబు(26)గా గుర్తించారు. మృతుడు అంబాజీపేట మండలం వాకలగరువు బుల్లియ్య కాలనీకి చెందిన వాడిగా గుర్తించారు. నాగేంద్ర బాబు తన ద్విచక్ర వాహనంపై ఒంటరిగా వెళుతున్న సమయంలో ఎదురుగా మరో ముగ్గురితో కూడిన ద్విచక్ర వాహనంతో బలంగా ఢీకొట్టడంతో నాగేంద్రబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన ఆ ముగ్గురు యువకులు పరారయ్యారు. ప్రమాదానికి కారణమైన ముగ్గురు యువకులను గుర్తించే వరకు మృతదేహాన్ని తరలించేది లేదని మృతుని వర్గీయులు ఆందోళన చేపట్టారు. నిందితులను అరెస్ట్ చేసే వరకు మృతదేహాన్ని తరలించమని ఆందోళన చేపట్టడంతో అంబాజీపేటలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పి.గన్నవరం సిఐ రుద్రరాజు భీమరాజు, అంబాజీపేట ఎస్సై షేక్ సుభాని, పి.గన్నవరం ఎస్సై శివకృష్ణ, ఎస్ఐ ఏ.చైతన్యకుమార్ లు ఆందోళనకారులతో చర్చలు జరిపిన తర్వాత అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

# అంబేద్కర్ అందరివాడు.. యుగ పురుషుడు

### ఘనంగా డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

### రామచంద్రపురంలో ఏడాదిలోపు 'అంబేద్కర్ భవన్' నిర్మిస్తాం : మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక న్యాయానికి ప్రతీక డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు రామచంద్రపురంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ వేడుకల్లో పాల్గొని, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మంత్రి సుభాష్ తొలుత తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, అనంతరం మెయిన్ రోడ్డు, జల్లిపేట మరియు జగన్నాయకుల పాలెంలోని అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**సామాజిక సమానత్వమే అంబేద్కర్ లక్ష్యం**

మంత్రి మాట్లాడుతూ "అంబేద్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన వారు కాదు, ఆయన అందరివాడు. కుల నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, మహిళల హక్కుల కోసం ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం" అని కొనియాడారు. నెహ్రూ ప్రభుత్వంలో న్యాయశాఖతో పాటు కార్మిక, విద్యుత్, జలవనరుల శాఖల్లో ఆయన పోషించిన పాత్ర దేశాభివృద్ధికి పునాది వేసిందని గుర్తు చేశారు.

**రామచంద్రపురానికి అంబేద్కర్ భవన్ హామీ**

దళిత సంఘాల నేత పిల్లి రాంబాబు మరియు ఇతర నాయకులు రామచంద్రపురంలో అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. రామచంద్రపురంలో ఏడాది లోపు అంబేద్కర్ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ భవన నిర్మాణానికి స్థలం కేటాయించడంతో పాటు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ తరపున అన్ని విధాలా సహకారం అందిస్తామని ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం సభలో ప్రకటించారు.

**పుస్తకావిష్కరణ**

ఇదే వేదికపై పిల్లి రాంబాబు రచించిన "ఆధునిక భారతదేశ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్" పుస్తకాన్ని మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఉండవల్లి శివ, చందమామ వాసు, కంచుమర్తి బాబురావు, కాటే సుబ్రమణ్యం, వివిధ దళిత సంఘాల నాయకులు మరియు కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయాలే సమాజ నిర్మాణానికి పునాది

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సమానత్వాన్ని పునాదిగా తీసుకుని ఒక వర్గానికో, ప్రాంతానికో పరిమితమైన నాయకుడు కాదని, ప్రపంచ స్థాయి మేధావిగా కుల వివక్ష నిర్మూలన, స్త్రీ సాధికారత, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి అనన్యసామాన్యమని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం వల్లే నేడు మనమందరం సమాన హక్కులతో జీవిస్తున్నామని తెలిపారు. సమాజంలో మానవ హక్కులు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన అంబేద్కర్ ఆదర్శాలను గుర్తుచేసుకుంటూ, యువత ఆయన రచనలు, సంస్కరణల పట్ల అవగాహన పెంపొందించుకుని సామాజిక న్యాయం, సమానత్వ విలువల దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాల పిల్లల విద్య, అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, సామాజిక-ఆర్థిక సంరక్షణ కార్యక్రమాలు పారదర్శకంగా అమలయ్యేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో అమలవుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, విద్యా సంక్షేమ పథకాలు, స్వచ్ఛంద సంస్థల కార్యక్రమాలు కూడా అంబేద్కర్ సామాజిక న్యాయ సిద్ధాంతాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. కోనసీమ జిల్లా అంబేద్కర్ ఆశయాలను ఆధారంగా చేసుకుని సమాజ నిర్మాణ దిశగా ముందుకు సాగాలని ఆయన అన్నారు. ఆర్డీవో జి.మమ్మీ మాట్లాడుతూ, సమాజంలో మానవ హక్కులు, సమానత్వం కోసం అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు.



ఆయన ఆశయాలను నిత్య జీవితంలో ఆచరిస్తూ నవ భారత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జంగా బాబురావు మాట్లాడుతూ సమానత్వం, సామరస్యంతో కూడిన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలన్నారు. అంటరానితనాన్ని ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి దేశం గర్వించే స్థాయికి ఎదిగిన అంబేద్కర్ ఆదర్శప్రాయులని తెలిపారు. రత్నకుమార్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు, హక్కులు కల్పించిన రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిని వేసిందన్నారు. ఇసుకపల్లి రఘుబాబు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనే మన లక్ష్యమవ్వాలని, ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ బాధ్యతగల పౌరులుగా ఉండడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఈ.జ్యోతిలక్ష్మి దేవి, ఏవో కే.కాశీ విశ్వేశ్వరరావు, డి.రత్నకుమార్, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతీ ఇంట్లో ఇద్దరు, ముగ్గురు పిల్లలు ఉండాలి

## ఫెర్టిలిటీ సంరక్షణపై ఒయాసిస్ జననీ యాత్ర అభినందనీయం : కొత్తపేట ఎమ్మెల్యే బండారు


**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫెర్టిలిటీ సంరక్షణపై అవగాహన, సమర్థవంతమైన చికిత్సలను గ్రామీణ ప్రాంతాలకు చేరవేసేందుకు ఒయాసిస్ ఫెర్టిలిటీ చేపట్టిన 'జననీ యాత్ర' ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభినందించారు. జననీ యాత్ర రావులపాలెం హై స్కూల్ చేరిన సందర్భంగా మంగళవారం సంస్థ ప్రతినిధులు ఆయనను కలుసుకున్నారు. తమ సేవల గురించి వివరించారు. జననీ యాత్రను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అనపర్తి తెదేపా పరిశీలకులు ఆకుల రామకృష్ణతో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనాభా తగ్గుదలపై హెచ్చరికలు చేస్తున్నారని, రాబోయే రోజుల్లో యువ జనాభా తగ్గిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ముందే హెచ్చరిస్తున్నారన్నారు. ఇటువంటి సమయంలో




ఈ యాత్ర ఒక ప్రధాన పరిష్కార మార్గంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్రంలో జననాల రేటు 1.7కి తగ్గిందని, ఇది భవిష్యత్తులో సామాజిక-ఆర్థిక సవాళ్లకు కారణమవుతుందన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఇద్దరు, ముగ్గురు పిల్లలైనా కలిగి ఉండాలని ముఖ్యమంత్రి చెబుతున్నారన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఇద్దరు, ముగ్గురు పిల్లలైనా కలిగి ఉండాలని ముఖ్యమంత్రి చెబుతున్నారన్నారు. ఈ సమయంలో ఫెర్టిలిటీ సమస్యలు గుర్తించడం, సరైన ఆహారం, జీవనశైలి మార్పులు, వైద్య సహాయం అవసరమన్నారు. ఇన్‌ఫెర్టిలిటీని ఒక సామాజిక రుగ్మతగా కాకుండా వైద్యపరమైన సవాలుగా చూడాలని,ఈ యాత్ర ద్వారా అనేక కుటుంబాలు లబ్ధి పొందే అవకాశం ఉందన్నారు. 2009లో ఏర్పాటైన ఒయాసిస్ ఫెర్టిలిటీ సంస్థ భారతదేశంలో 19 నగరాల్లో 31 కేంద్రాలతో సేవలు అందిస్తోందని,ఒక లక్షకు పైగా శిశువుల జననంలో కీలక పాత్ర పోషించి, ఐవీఎఫ్, ఐయూఐ వంటి అధునాతన చికిత్సలతోపాటు సమగ్ర ఫెర్టిలిటీ సేవలను అందిస్తుందని తెలిసిందని, గ్రామీణ ప్రాంతాలకు వారి సేవలు చేరవేయాలనే తపనను అభినందిస్తున్నట్లు తెలిపారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

## ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు





**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు అమలాపురం నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వివిధ ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొని అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈదరపల్లి, ఎస్.యానాం, ఉప్పలగుప్తం గ్రామాలతో పాటు అమలాపురం పట్టణంలోని గడియార స్తంభం, మద్దాలవారి పేట, నల్లవంతెన, 30వ వార్డులోని బండివారి పేట, 9వ వార్డు, పేరూరు, భీమనపల్లి ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఎత్తు రోడ్ వద్ద ఆటో డ్రైవర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటో ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ ప్రపంచమే గర్వించదగ్గ గొప్ప మేధావి అని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, కుల నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి అనన్యసామాన్యమని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీలకు సమాన హక్కులు కల్పించిన మహనీయుడిగా అంబేద్కర్‌ను అభివర్ణించారు. చదువు ద్వారానే జీవితాల్లో మార్పు సాధ్యమని, ప్రతి తల్లి తన పిల్లలను ఉన్నత విద్యావంతులను చేయాలని సూచించారు. మహిళలు పొదుపు అలవాటు చేసుకోవాలని, కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవాలని అన్నారు. పురుషులు మద్యపానానికి దూరంగా ఉండాలని, వ్యసనాలకు బానిసలై జీవితాలను పాడుచేసుకోవద్దని హితవు పలికారు. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆచరించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలు లేకుండా సమసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల ప్రతినిధులు, ఆటో డ్రైవర్లు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

అంబాజీపేటలో

# విగ్రహాల వివాదం రగిలింది



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట హడ్ కో కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు వచ్చిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు చుక్కెదురైంది. కాలనీలో గత ఏడాది అంబేద్కర్ విగ్రహం పక్కనే మాది ఉప ప్రధాని డాక్టర్ బాబు బాబు జగజ్జీవన్రామ్ విగ్రహం ఏర్పాటు చేయడంతో వివాదం తలెత్తింది. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యేను పక్కనే ఉన్న డాక్టర్ బాబు జగజీవన్ రామ్ విగ్రహానికి పూలమాల వేయండి అంటూ దండోరా నాయకులు కోరారు. ఇక్కడ విగ్రహం సమస్య ఇంకా పరిష్కారం కాలేదని స్థానిక ఎస్సీ నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే జగజ్జీవన్రామ్‌కి పూలమాల వేసేందుకు వెళుతుండగా ఎస్సీ నాయకులు అడ్డుకుని ఎమ్మెల్యేను అక్కడిన నుండి పంపిచేశారు. ఇక్కడ సమస్య పరిష్కారం కానప్పుడు ఎందుకు వచ్చారు? రెండు వర్గాల మధ్య చిచ్చు పెట్టడానికి వచ్చారా? అంటూ ఎమ్మెల్యేను నిలదీశారు. అంబేద్కర్ పూలమాల వేసి జగజ్జీవన్ రామ్ కి ఎందుకు వేయకుండా అవమానిస్తారా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే కాన్వాయిని అడ్డగించారు. దాంతో పోలీసులకు దండోరా నాయకుల మధ్య తోపులాట జరిగింది. ఈ సమయంలో ఒక గర్భిణి, ఒక మహిళ పడిపోవడంతో స్థానకంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. ఇక్కడ ఉన్న సమస్యను తర్వలో పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని దండోరా నాయకులకు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# రాజ్యాంగ శిల్పికి ఘన స్మరణ

## జిల్లా ఎస్పీ రాహుల్ మీనా నివాళి



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు సందర్భంగా అమలాపురంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు సమాజంలోని అట్టడుగు వర్గాలకు చేరాలని, చట్టం ముందు అందరూ సమానులనే స్ఫూర్తితో పోలీస్ యంత్రాంగం పనిచేయాలని పేర్కొన్నారు. అంబేద్కర్ నమ్మిన చదువు, సంస్కారం, క్రమశిక్షణ అనే సూత్రాలను ప్రతి పోలీస్ అధికారి తమ విధి నిర్వహణలో పాటించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సామాజిక న్యాయం కోసం నిలబడటమే అంబేద్కర్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏ.వి.ఆర్.పి.బి. ప్రసాద్, ఏఆర్ డిఎస్పీ సుబ్బరాజు, ఎస్బి సిఐ పుల్లారావు, సీఐ నాగ ప్రసాద్, సీఐ తమ్మి నాయుడు, ఆర్ఐలు బ్రహ్మానందం, కోటేశ్వరరావు, ఇతర జిల్లా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోషణ్ పక్వాడను సద్వినియోగం చేసుకోండి



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన ఆలమూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో కార్యదర్శి కే.మోక్షాంజలి అధ్యక్షతన పోషణ్ పక్వాడ సమావేశం జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో రాజు పాల్గొని కేంద్ర ప్రభుత్వం చిన్నారుల మెరుగైన ఆరోగ్యానికి ప్రవేశపెట్టిన పోషణ్ పక్వాడను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈనెల తొమ్మిదిన ప్రారంభమైన పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని 23 వరకూ కొనసాగించాలని సూచించారు. చిన్నారులు, విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవలసిన ఆహార పదార్థాలను క్రమం తప్పకుండా వివరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. జంక్‌ఫుడ్స్ జోలికి వెళ్లొద్దని హెచ్చరించారు. అనంతరం పోషణ్ పక్వాడ పోస్టర్‌ను ఎంపీడీఓ రాజు ఆవిష్కరించారు. ఆలమూరు తోపాటు నర్శిపూడి, చొప్పెల్ల సెక్టార్ల పరిధిలోని పలు గ్రామాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమాలు జరిగాయి. సూపర్‌వైజర్లు బి,వరలక్ష్మి, కె.నాగసత్యవేణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కే.గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

# అంబేద్కర్ జయంతి వేడుకలు



**కే.గంగవరం మండలం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక కే.గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వి.ఎస్. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. అంబేద్కర్ కేవలం అనగారిన వర్గాలకే కాకుండా, సమాజంలోని అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం చేకూర్చారని, రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థులందరూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తూ, ఆయన చూపిన బాటలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు సుమతి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్, డ్రాయింగ్ మాస్టర్ దుర్గారావు, గోవిందరాజు మరియు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రత్తిపాడు ఏలేశ్వరం, మండలాల పరిధిలో పలు గ్రామాల్లో చేపట్టిన

# గ్రామ సభలలో పాల్గొన్న ప్రత్యేక అధికారి సిడిపిఓ పద్మావతి


## అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సిడిపిఓ పద్మావతి



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం తూర్పులక్ష్మీపురం ప్రత్తిపాడు మండలం ఏలూరు యుజె పురం, చిన్నశంకర్లపూడి,గ్రామాలలో నిర్వహించిన గ్రామ సభలకు ఆయా పంచాయతీల ప్రత్యేక అధికారి, సిడిపిఓ పద్మావతి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ముందుగా స్వర్గీయ డాక్టర్ బాబా సాహెబ్ అంబెడ్కర్ 135 వ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి స్థానిక నాయకులు గ్రామపంచాయతీ పరిపాలన అధికారులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో ప్రజలు తమ వినతులను ప్రత్యేక అధికారికి అందించారు. ప్రత్తిపాడు మండలం యుజె పురం గ్రామ సభనందు స్థానిక ప్రజలు గ్రామంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని, దీనివల్ల వాటర్ ట్యాంక్ నుండి మంచి నీటి సరఫరాకు ఇబ్బంది ఎదురవుతుందని తెలిపారు. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కట్టి సుమారు 25 సంవత్సరాలు అయ్యిందని ప్రస్తుతం వాటర్ ట్యాంక్ శిథిలావస్థ స్థితిలో ఉన్నందున ప్రత్యామ్నాయంగా నూతన వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని గ్రామస్థులు ప్రత్యేక అధికారి పద్మావతికి తెలియపరిచారు. ఆయా గ్రామాలలో పలు సమస్యలపై వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ప్రజలు తెలిపిన సమస్యలపై సిడిపిఓ పద్మావతి సానుకూలంగా స్పందించారు. ప్రజలు సూచించిన సమస్యలను స్థానిక శాసనసభ్యులు మరియు సంబంధిత ఉన్నతాధికారులు చెరువుతోపూర్తి చేసేదిగా పనిచేస్తామని తెలిపారు. అనంతరం అంగన్వాడీ అద్వర్యంలో చేపట్టిన 8వ పోషణ పక్వాడలో భాగంగా కార్యకర్తలు పోషకాహార ప్రదర్శన ద్వారా జంక్ ఫుడ్ (రంగు కవర్ల లో నిల్వచేయబడిన హానికరమైన ఆహారపదార్థాలు) వినియోగించకుండా ఉండాలని సంప్రదాయబద్ధమైన ఇంట్లో తయారు చేసిన ఆహారపదార్థాలు మన ఆరోగ్యానికి మంచిదని, అవగాహన కల్పించారు. పిల్లల్లో సమగ్రాభివృద్ధికి నవ చేతన ఆదర్శిల కథలు పాటలు ఆటలు మొదలైన అంశాలు గురించి వివరించారు. మొబైల్స్ టీవీలో స్క్రీన్ టైం చాలావరకు తగ్గించాలి అని చెప్పారు. ఈ కార్యక్రమములో స్థానిక కూటమి నాయకులు, గ్రామ అభివృద్ధి అధికారులు, గ్రామ పంచాయతీ సచివాలయ సిబ్బంది, అంగన్వాడి సూపర్వైజర్లు సూర్యకుమారి, వరలక్ష్మి, సిబ్బంది, తదితరులు హాజరయ్యారు.

అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా

# చక్రధరరావు నియామకం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయశాఖ దేవస్థానాల పరిపాలనలో భాగంగా ఈ మధ్య కాలంలో పలుమార్లు పలు దేవాలయాల కార్యనిర్వహణా అధికారులను బదిలీలు చేసింది. ఇందులో భాగంగానే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం రత్నగిరి శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం పూర్తి అదనపు బాధ్యతల ఇంచార్జి కార్యనిర్వహణ అధికారిగా ఎన్.ఎస్.చక్రధరరావు నియామకం అయ్యారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా సేవలను అందించిన ఈయన అన్నవరంనకు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఈయన దేవస్థానంలోని తన కార్యాలయంలో సోమవారం ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు. గతంలో ఈయన అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ కార్యనిర్వహణ అధికారిగా కూడా విధులను నిర్వర్తించారు. కాగా గత కొంత కాలంగా అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణ అధికారిగా విధులను నిర్వహిస్తున్న వేంద్ర త్రినాధరావు బదిలీ అయ్యారు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రముఖ పుణ్య క్షేత్రం ద్వారకా తిరుమల దేవస్థానంలో కార్యనిర్వహణ అధికారిగా బాధ్యతలను చేపట్ట నున్నారు.

# డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా మజ్జిగ, లడ్డులు పంపిణీ



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలో ఎర్రవరం హై రోడ్డుపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రజా హక్కుల న్యాయ పోరాట సంఘ సభ్యులు,జర్నలిస్టులు బాటసారులకు మజ్జిగ,లడ్డూలు మంగళవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందని,అంబేద్కర్ మహోన్నత వ్యక్తి అని,భారత రాజ్యాంగ సృష్టికర్త,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా సుమారు వెయ్యి మందికి పైగా మజ్జిగ,లడ్డూలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మూర రాజశేఖర్, సాలెం రాజ్, డి.రాజు, రాజ్ కుమార్, నందు శ్రీనివాస్, వీరబాబు, కే.శివ, ఎం.బాబి తదితరులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహానుభావుడు అంబేద్కర్

## దేవీపట్నం మండలం కూటమి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు



**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం,ఎంపీడీవో కార్యాలయం నందు కూటమి నాయకులు, మండల ప్రభుత్వ అధికారులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు అనంతరం మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు అంబేద్కర్ జయంతిని ఉద్దేశించి మాట్లాడుతూ.ముందుగా ఆయన స్వరములో నుంచి వచ్చిన మాట జై భీమ్... జై భీమ్.జై భీమ్... అంటూ నినాదాలు పలికారు. డా. బి ఆర్.అంబేద్కర్ కేవలం రాజ్యాంగ రచయితగా మాత్రమే కాకుండా, విద్యాభ్యాసంలోను, దళితుల సంక్షేమంలోను మరియు అన్ని పక్షాల హక్కులను పరిరక్షించడంలోనూ ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గొప్ప రాజ్యాంగ నిర్మాత, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అలాగే ఆయన అందించిన రిజర్వేషన్ ఫలాలు వల్లే ఈరోజు మనమందరం ఇంత స్వేచ్ఛగా ఉండగలుగుతున్నాం. అలాంటి మహనీయులను ఎల్లప్పుడూ జ్ఞప్తికి తెచ్చుకొని ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మనందరికీ ఉంది అలాగే ఆయన అందించిన స్వేచ్ఛ ఫలాల ద్వారా మనందరం కలిసి స్ఫూర్తిదాయకంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సల్మాన్ రాజ్, బిజెపి మండల అధ్యక్షులు కారం రామన్న దొర, జనసేన మండల అధ్యక్షులు సారపు వెంకటరాయుడు, సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, మాజీ మండల అధ్యక్షులు తైలం గంగాధర్, ముంద్రు మధుసూదన్ రావు, మరిశేట్ల వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ ముచ్చు వీర వెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులు కీర్తి గంగరాజు, అయినాల వెంకటేశ్వర్లు, కొమరం దొరబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు రేలంగి రాంబాబు, జనసేన నాయకులు మట్ట నరసింహమూర్తి, మాజీ తెలుగు యువత కార్యదర్శి చవళం శివరామకృష్ణ, మాజీ సర్పంచ్ గౌరేశ్వరి, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఈరేటి బ్రహ్మాజీ ,సొసైటీ డైరెక్టర్ పల్లపాటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కుంజం రాజమణి,మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జొన్నల రాంబాబు, విద్యా కమిటీ అధ్యక్షులు సామరెడ్డి రామకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షులు పోతుల వాసు రాచ శ్రీనివాస్, మన్నేపల్లి కనకం, మండల ప్రచార కార్యదర్శి పేరుగాని ఏసు, మండల వైస్ ఉపాధ్యక్షులు మిర్తివాడ వీరబాబు, తెలుగు యువత ఉపాధ్యక్షులు వంశీ, కొండ్ల సురేష్ రెడ్డి, కొత్తపల్లి సతీష్, అయినవిల్లి భద్ర, రాజేష్, మీడియా కోఆర్డినేటర్ కారం దుర్గాప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శివ,కూటమి నాయకుడు సచివాలయ సిబ్బంది భారీ ఎత్తులో పాల్గొన్నారు.

ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయంలో

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి వేడుకలు

## అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన మండల పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏలేశ్వరం మండలం పరిషత్ అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జోహార్ అంబేద్కర్ అంటూ నినాదాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ యావత్ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అభివర్ణించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామరాజు వర్మ, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి లక్ష్మణ రావు, ఎంపీటీసీ కొప్పుల బాబ్జి, పలువురు నాయకులు, మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# అంబేద్కర్ ఆశయసాధనకు అందరు కృషి చేయాలి : స్వప్న కుమారి



**అడ్డతీగల, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందరికీ ఆదర్శనీయుడని ఆయన సూచించిన మార్గం చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం అడ్డతీగలలో ఆయన విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈ.స్వప్న కుమారి మాట్లాడుతూ రాజ్యాంగ శిల్పి, రాజకీయ నేత, న్యాయవాది, సంఘసంస్కర్త, ఆర్థిక శాస్త్రవేత్త అయిన అంబేద్కర్ మహిళలకు రాజ్యాంగంలో అనేక హక్కులు కల్పించేలా దిశా నిర్దేశం చేసారన్నారు. అంబేద్కర్ ఆశయసాధనకు అందరు కృషి చేయాలని ఆమె సూచించారు. తెదేపా రంపచోడవరం యూత్ వైస్ ప్రెసిడెంట్ బీరా బాలయోగి మాట్లాడుతూ అంబేద్కర్ బడుగు బలహీనవర్గాలకు రాజ్యాంగంలో పెద్దపీట వేశారన్నారు. ప్రజలందరికీ సమాన న్యాయం చేస్తూనే రాజ్యాంగం రచించారన్నారు. సంఘసంస్కర్తగా సమాజంలో అనేక కార్యక్రమాలు చేపట్టారు అన్నారు. అడ్డతీగల మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.వి. వి కుమార్ మండలంలో పలు పంచాయతీల్లో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించాలని ఆదేశించడంతో పలుచోట్ల అంబేద్కర్ జయంతి వేడుకలను గ్రామపంచాయతీ కార్యదర్శి ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో శ్రావణ్ కుమార్, అర్జున్, బీజేపీ మండల అధ్యక్షులు రాజు, దుంపల శ్రీను, దంగేటి సత్తిబాబు, నడిగట్ల రమేష్, సమర్థ కృష్ణ, ముత్యాల విష్ణు, చంద్రరావు, ఎక్స్ ఎంపిటిసి పుడిగి ఆదిలక్ష్మి, రాజా, అబ్బాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకున్నాయి : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్




**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకొని అంబేద్కర్ చిత్రపటానికి పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ , రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్, ఎస్.బొజ్జిరెడ్డి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత ముఖ్య అతిథులుగా హాజరై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మంగళ వారం స్థానిక ఐటిడిఏ కార్యాలయపు సమావేశపు హాలులో ఏర్పాటుచేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని ముఖ్య అతిథి పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని వర్గాల వారికి తగు న్యాయం చేసే విధంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారు భారత రాజ్యాంగాన్ని రచించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ భారత రాజ్యాంగం వలన అంటరానితనం చాలావరకు నిర్మూలించడం జరిగిందని ఆయన తెలిపారు. పేద బడుగు బలహీన వర్గాల వారికి రాజకీయాల్లోనూ ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ భారతదేశంలో ఉన్న పేద ప్రజలకు రిజర్వేషన్ అమలు జరుగుచున్నాయని ఆయన తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా పోలవరం జిల్లాలోని వివిధ వర్గాలకు చెందిన గిరిజనులకు అభివృద్ధి చేసే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాలైన పథకాలు అమలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారు రాసిన రాజ్యాంగం ప్రపంచం దేశాలు ఆదర్శంగా తీసుకున్నాయని ఆయన అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారు రాసిన రాజ్యాంగం ప్రతి భారత పౌరుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారిని శిరస్థాయిగా ఎప్పటికప్పుడు గుర్తుంచుకునే బాధ్యత మన అందరిపై ఉందని ఆయన తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చాలా నిరుపేద కుటుంబం నుంచి వచ్చి కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా కొంతకాలం పనిచేయడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. భారతదేశంలోని సమాన హక్కుల లో భాగంగా అందరికీ ఓటు హక్కు కల్పించిన ఘనత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారికి దక్కుతుందని ఆయన అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతదేశంలో వేసిన పునాది వల్లనే మనందరం స్వేచ్ఛగా జీవించుచున్నామని ఆయన అన్నారు. మన భారతదేశానికి 1947 సంవత్సరంలో స్వతంత్రం వచ్చినప్పుడు బ్రిటిష్ సామ్రాజ్యం భారతదేశ ముక్కలు ముక్కలుగా విడిపోతుందని భావించిన తరుణంలో భారత రాజ్యాంగం వలన భారతదేశ ప్రపంచ దేశాలలో అన్ని విధాల అభివృద్ధి పదంలో ఉందని ఆయన అన్నారు. భారతదేశంలోని గిరిజన ప్రాంతాలలో గిరిజనులకు భారత రాజ్యాంగం ద్వారా కొన్ని ప్రత్యేక హక్కులు కల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలోని ఈ ప్రాంత గిరిజనులకు అభివృద్ధి చేయుటకు ఒక ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఉదాహరణకు స్విజర్లాండ్ లోని అభివృద్ధి గురించి అదేవిధంగా భారత ప్రభుత్వ అభివృద్ధి గురించి జిల్లా కలెక్టర్ వారు మన దేశం ఎంత అభివృద్ధి చెందింది ఆయన వివరించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయుచున్న పథకాలు ఎప్పటికప్పుడు అమలుపరచుచు మన జిల్లా అభివృద్ధి సాధించే విధముగా మనందరం కలిసి కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ యస్.బొజ్జిరెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారి 135 జయంతి జరుపుకోవడం భారత దేశ ప్రజల సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారి ఆశయాలు ముందుకు తీసుకెళ్లే విధంగా మనమందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన అన్నారు. మన ప్రాంతాన్ని, మన జిల్లాని, మన రాష్ట్రాన్ని, మన దేశాన్ని ప్రతి భారతీయ పౌరుడు అభివృద్ధి చేసుకొనే విధంగా మనమందరం కృషి చేయాలని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు ఈ ప్రాంత గిరిజనులు సద్వినియోగపరచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి జరుపుకోవడం చాలా సంతోషకరమైన విషయమని ఆమె అన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి భారతీయ పౌరుడికి సమాన హక్కులు కల్పించడం జరిగిందని ఆమె అన్నారు. ఈరోజు మనమందరం స్వేచ్ఛగా జీవించుచున్నామంటే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ గొప్పతనమని ఆమె అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారిని ప్రతి భారతీయ పౌరుడు ఎప్పటికప్పుడు గుర్తుంచుకునే బాధ్యత మనందరిపై ఉందని ఆమె అన్నారు. అదేవిధంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ వారి సెంటర్లోని అంబేద్కర్ వారి విగ్రహానికి జిల్లా కలెక్టర్ వారు రాష్ట్ర ఎస్ టి కమిషన్ మెంబర్ గొర్లె సునీత పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, ఏపీఓ జనరల్ డివిఎన్వి రమణ, డిఆర్డిఏ పిడి రత్నాకరరావు, జిల్లా నైపుణ్యాధికారి సుధాకర్ రావు, జిల్లా ఐసిడిఎస్ పిడి కే.ఉమా, ఏవో రాజు, డాక్టర్ వినోద్ కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామ్మోహన్ రావు,మండల వ్యవసాయ శాఖ కే లక్ష్మణ్, ఐటీడీఏ మేనేజర్ బి. రాజు, సూపర్డెంట్ రాజారెడ్డి,దళిత సేవ సంఘ నాయకులు రమణయ్య, దండం సింహాద్రి, నాగేశ్వరరావు, కప్పల వెంకట్రావు, సుధాకర్, రామచంద్రారావు, చిన్నబ్బాయి, శ్రీ రామ్, పండ చల్లన్న దొర, శ్యాం కుమార్, సుధాకర్, సురేష్, కారం సూరిబాబు, జయరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీలను మోసం చేస్తూ నిర్వహిస్తున్న క్వారీని ఆపాలి

## ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం బోలగొండ పంచాయతీ చుప్పరిపాలెంలో గిరిజన సొసైటీ పేరుతో గిరిజనేతరులు నిర్వహిస్తున్న క్వారీని నిలుపుదల చెయ్యాలని ఏపీ ఆదివాసీ జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు కావాల్సిన ప్రాంతంలో చట్టాలను తుంగలో తొక్కుతూ అధికార బలంతో గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కోట్ల సంపదను తరలించుకుపోతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం తగదని ఆయన తెలిపారు. అంతే కాకుండా 2015 సంవత్సరంలో ముగిసిన సొసైటీ గడువును లెక్క చెయ్యకుండా తానే సొసైటీ ప్రెసిడెంట్ గా చలామణి అవుతూ సాటి గిరిజనులను మోసం చేస్తున్న నేసం పోసియ్యపై చట్టపరమైన చర్యలు తీసుకొని గిరిజన సొసైటీ పేరిట నిర్వహిస్తున్న రంగు క్వారీ నిర్వహణ పై విచారణ జరిపించి స్థానిక ఆదివాసీ ప్రజలకు న్యాయం చెయ్యాలని ఆయన కోరారు.

# నగరపాలక సంస్థ కార్యాలయంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

## స్ఫూర్తిదాయకం అంబేద్కర్ జీవితం : కలెక్టర్ కీర్తి చేకూరి – బిఆర్ అంబేద్కర్ గొప్ప దార్శనికుడు : కమిషనర్ రాహుల్ మీనా

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహోన్నతమైన రాజ్యాంగాన్ని రచించి దేశ ప్రజలకు దశ దిశ నిర్దేశించిన బాబా సాహెబ్ అంబేద్కర్ చిరస్మరణీయులని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని ఆ మహనీయుని విగ్రహానికి కమిషనర్ రాహుల్ మీనాతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,1944 లో డా.బిఆర్ అంబేద్కర్ రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ ను సందర్శించారని గుర్తుచేశారు. రాజమహేంద్రవరం నగరపాలక చరిత్రలో బిఆర్ అంబేద్కర్ ఉండటం మనకు దక్కిన గొప్ప అదృష్టమని మాట్లాడారు. 1947 లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని అందరూ సంతోష పడుతున్న సమయంలో.. మన దేశానికి సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యం కూడా ముఖ్యమని భావించి, ఆ దిశగా అడుగులు వేసిన వ్యక్తి డాక్టర్ భీమ్ రావ్ అంబేద్కర్ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి అన్ని హక్కులను కల్పించే విధంగా, సమాజ అభివృద్ధి కొరకు ఆయన మేధాశక్తితో చక్కని రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. విద్య వల్లనే సామాజిక న్యాయాన్ని ప్రజలకు అందించవచ్చని బలంగా నమ్మి.. స్త్రీ విద్యకు విశేషంగా కృషి చేశారన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని.. అలాగే అందరూ సమానమనే భావన ప్రతిఒక్కరిలోనూ కలగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ భారతరత్న డా.బిఆర్ అంబేద్కర్ గొప్ప సామాజికవేత్తే కాకుండా ఆర్థికవేత్తగా, న్యాయనిపుణుడిగా దేశానికి విశిష్ట సేవలందించారన్నారు. కుల, మత, లింగ, ప్రాంత, భాష వివక్ష లేకుండా దేశ పౌరులందరికీ రాజ్యాంగం ద్వారా సమాన హక్కులు కల్పించారన్నారు. ఆయన రాసిన పుస్తకాలు, ఆధునిక సమాజానికి అంబేద్కర్ చేసిన సేవ అనన్యమైనవని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిసున్న పాలన, పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకు డా. బిఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచిన విలువలు, సూత్రాలే ముఖ్య కారణమన్నారు. ఆ మహనీయుని కృషి ఫలితంగానే ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాల కంటే భారతరాజ్యాంగం ఉన్నత విలువలు కలిగి ఉందని కితాబిచ్చారు. ఆ మహనీయుని మార్గదర్శకాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆర్ శివ రాముడు, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, డిప్యూటీ డైరక్టర్(అమృత్) రామారావు, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, మేనేజర్ అబ్దుల్ మాలిక్, రెవిన్యూ అధికారి సీహెచ్ శ్రీనివాస రావు,ఈఈ మదర్సా అలీ, అకౌంటెంట్ నాగమణి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.



రంపచోడవరం కేంద్రంగా

# అన్న కాంటీన్ ప్రారంభించనున్న ఎమ్మెల్యే శిరీష దేవి






**రంపచోడవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ ప్రభుత్వం కొత్తగా 62 క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించనుంది. నేడు ముఖ్య మంత్రి చంద్రబాబు పెద కూరపాడు నియోజక వర్గం ధరణికోటలో ప్రారంభించనుండగా రంపచోడవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే శిరీష దేవి ప్రారంభించనున్నారు. నూతనంగా ఏర్పాటు అయిన పోలవరం జిల్లా రంపచోడవరం లో అన్న కాంటీన్ ఏర్పాటు చెయ్యడం పట్ల జిల్లాలోని 12 మండలాలలోని సుధీర ప్రాంతాల నుండి వివిధ పనుల నిమిత్తం రంపచోడవరం వచ్చే గిరిజన ప్రజలకు అన్న కాంటీన్ ద్వారా అతి తక్కువ ధరలకు భోజనం అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 207 అన్న క్యాంటీన్‌లు ఉండగా.. కొత్తగా ఏర్పాటు చేసే 62 క్యాంటీన్లతో కలిసి మొత్తం క్యాంటీన్ల సంఖ్య 269కి చేరనుంది. అన్న క్యాంటీన్లు మళ్లీ ప్రారంభించనప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8.80 కోట్ల మంది పేదలు భోజనాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పేదల ఆకలి తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ క్యాంటీన్ల ద్వారా ప్రతిరోజూ లక్షలాదిమంది ఆకలి తీరుతోంది. అయితే మొన్నటి వరకు నగరాలు, పట్టణాల్లో ఉన్న అన్న క్యాంటీన్లు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా అందుబాటులోకి రానున్నాయి.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

బుధవారం, 15 ఏప్రియల్ 2026
www.viswamvoice.com






ప్రపంచం గర్వించదగిన

## మేధావి అంబేద్కర్ : జక్కంపూడి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచం గర్వించదగిన మేధావి నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా అన్నారు. మంగళవారం మండలంలోని నిడిగట్ల, కోటికేశవరం, తదితర గ్రామాల్లో నిర్వహించిన అంబేద్కర్ 135వ జయంతి వేడుకల్లో రాజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిడిగట్లలో అంబేద్కర్ యువజన సంఘం బాణాసంచా కాల్చుతూ,తీన్మార్ డప్పులతో రాజాకి ఘన స్వాగతం పలికారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి రాజా పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పిస్తూ జై భీమ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం రాజా మాట్లాడుతూ ఏ దేశానికి లేని అతిపెద్ద రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు.ఎవరైతే జీవించిన కాలంలో పేదవాళ్ల కోసం, అణగారిన వర్గాల కోసం పాటు పడతారో అటువంటి వ్యక్తులు భౌతికంగా దూరమైనప్పటికీ అందరి మనస్సులో సజీవంగా నిలిచి ఉంటారనడానికి అంబేద్కర్ నిదర్శనమన్నారు.అనంతరం సహపంక్తి భోజనాలలో పాల్గొని, అందరితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కర్రి నాగేశ్వర రావు, నక్కా రాంబాబు, కంటే వినయ్ తేజ, కొండపల్లి దుర్గారావు, గణేశుల పోసియ్య, యడ్ల గంగా సురేష్, రాజా రమాదేవి, ఏపీఆర్ చౌదరి, అడపా సుధీర్, అంబేద్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు వితరణ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని గుమ్ములూరు జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఉపాధ్యాయ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 20వేల రూపాయలుతో 250మంది విద్యార్థిని విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేసినట్లు రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా సంఘఅధ్యక్షులు నీరుళ్ళ రాజేష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను విద్యార్థిని,విద్యార్థులకు వివరించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్బిఐ సిబ్బందికి, ఉపాధ్యాయ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీష్ చంద్రబోస్, నాగేశ్వరరావు, చిన్నారావు, జాకోబ్ రాజు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

పశ్చిమ గోనగూడెంలో ఘనంగా

## అంబేద్కర్ 135వ జయంతి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** నవభారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను పశ్చిమ గోనగూడెం సచివాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకొని పశ్చిమ గోనగూడెం ప్రత్యేక అధికారి సామ్యూల్ బాబు ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సామ్యూల్ బాబు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను రూపుమాపి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించిన మహోన్నత వ్యక్తిగా అంబేద్కర్ను కొనియాడారు. నేటి యువతకు ఆయన ఆశయాలు ఆదర్శం కావాలని, ఆయన రచించిన రాజ్యాంగం కారణంగానే అందరికీ సమాజంలో స్వేచ్ఛ, సమాన హక్కులు లభించాయన్నారు. ఆయన రచించిన భారత రాజ్యాంగం నేటికీ యావత్తు ప్రపంచానికి దిక్సూచిగా వెలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ నదీషా, వీఆర్వో కుమారి, మాజీ సర్పంచులు రొంగల దేవిక శ్రీనివాస్, కుచ్చు చల్లారావు, మాజీ ఎంపీటీసీ కొయ్యే సామ్యూల్, సచివాలయ సిబ్బంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బేడ, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో

## అంబేద్కర్ ఘన నివాళి

**అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో హక్కులు సాధించుకుందాం : వీర్లపల్లి ఏసు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బేడ, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వీర్లపల్లి ఏసు పిలుపు నిచ్చారు. రాజమండ్రి రూరల్ కొంతమూరులోని జంగాల కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యేసుతో పాటు మరికొంతమంది నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వీర్లపల్లి ఏసు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి బలహీనవర్గాల శ్రేయస్సుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషి ఎన్నటికీ మరువలేమన్నారు. ఆయన ఆలోచన విధానం పోరాటం వల్లే నేడు బడుగు బలహీన వర్గాలు రాజ్యాంగ ఫలాలు అనుభవిస్తున్నాయని ఆయన అన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు పునరంకితం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ వీర్లపల్లి మార్క్ వైస్ ప్రెసిడెంట్ శివరాత్రి పెద ఉదలయ్య, సెక్రెటరి కర్రి చిన్న దుర్గరావు, పెద్దలు వీర్లపల్లి శరబందు, కప్పిరి వెంకన్న, వీర్లపల్లి జాన్, శివరాత్రి శ్రీను, కప్పిరి సంతోష్, శివరాత్రి చిన్న, ఉదలయ్య వీర్లపల్లి జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

మానవాళి ఉన్నంత వరకు

# అంబేద్కర్‌ను స్మరించుకుంటుంది

**ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం వర్ధిల్లుతుందంటే అంబేద్కర్ వల్లే..**
**ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, కమిషనర్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. మంగళవారం రాజమండ్రి గోకవరం బస్ స్టాండ్ వద్ద గల అంబేద్కర్ కాంస్య విగ్రహం వద్ద సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి రాజేంద్రప్రసాద్, ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాతపూడి వెంకటేష్ పర్యవేక్షణలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ కీర్తి చేకూరి రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ వాడ వాడల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు జరుగుతున్నాయంటే ఆయన దేశానికి అందించిన సేవలు, అభివృద్ధిని చూసి అంబేద్కర్ ను స్మరించుకుంటున్నారని అన్నారు. మహిళా విద్య, సమాజంలో అసమానతలు రాజ్యాంగం ద్వారా సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ వెలుగుతుందంటే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఫలితమేనని పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతులు, వర్ధంతి సందర్భంగా స్పందించుకోవడం కాదని నిరంతరం ఆయనను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తుందని అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఎస్సీ, బీసీ హాస్టల్స్ అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత రూ 50 లక్షలు సి ఎస్ ఆర్ నిధులతో వై జంక్షన్‌లో ఉన్న బీసీ హాస్టల్ అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అలాగే గణేష్ చౌక్‌లో ఉన్న ఎస్సీ హాస్టల్లో త్రాగు నీరు, విద్యుత్ దీపాలు ఇతర మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సమాజంలో అసమానతలు తొలగించడానికి అనేక సంస్కారణలు తీసుకొచ్చారని అన్నారు. మహిళా హక్కులు కల్పించడంతోపాటు, కుల నిర్మూలన చేయడంలో ఆయన కీలకపాత్ర వహించారని అన్నారు. దేవాలయాల్లోకి ఎస్సీ ఎస్టీలు వెళ్లకుండా మత చాందస్తవాదులు చేసిన కుట్రాలను అడ్డుకొని అందరికీ దేవాలయంలో ప్రవేశించే అర్హత కల్పించారని అన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి జరుగుతుందని, విద్యార్థులు అవకాశాలు అందిపుచ్చుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. రాజమండ్రిలో అంబేద్కర్ చరిత్ర ఉండడం ఆనందదాయకం అని అన్నారు. ఎస్సీ ఉద్యోగ సంఘాల నాయకులు కోరుకొండ చిరంజీవి రాజమండ్రి నగరంలో ఎస్సీ స్టడీ సర్కిల్ సొంత భవనం ఏర్పాటు చేయాలని, కోరుకొండలో ఎస్సీ హాస్టల్ భవనం శిథిలావస్థ స్థితిలో ఉందని దానికి భవనం నిర్మాణం చేయాలని సూచించారు. దీని పై స్పందించిన కలెక్టర్ నగరంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ను పూలే, అంబేద్కర్ భవనంలోని రెండో ఫ్లోర్ కేటాయించేందుకు కృషి చేస్తామని అన్నారు. అలాగే కోరుకొండ హాస్టల్ కు కేంద్రం నిధుల నుంచి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా దేశంలో అనేక వ్యవస్థలు తీసుకొచ్చి సంస్కరించాలని అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంఘసంస్కర్త అని అన్నారు కల్పించడం ద్వారా మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలని అన్నారు. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని విద్యార్థులు నైతిక విలువలతో ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గన్ని కృష్ణ, కాశీ నవీన్ కుమార్, కప్పల వెలుగు కుమారి, జనసేన నాయకులు వై శ్రీనివాస్, రాజేష్ ఖన్నా, తాళ్లూరి బాబు రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి,తాతపూడి వెంకటేష్ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కొల్లి సామ్ సన్, చంద్ర మళ్ళ రాజు,వీధి శ్యాం ప్రసాద్, దోకుబుర్ర శేషగిరి,కొల్లి నాగేశ్వరావు, కాపారపు భీమరాజు, పల్లెటి శ్రీను, వెంకటరమణ,కూడేల్లి అర్జున్, పెనుమాక సామ్యూల్, బద్దే జార్జ్ ఆంటోనీ, చాపల రాజు, తాళ్లూరి విజయ్ కుమార్, మోత నాగలక్ష్మి, జంగం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనం కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన

# మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్

**విద్య, వైద్యం అందరికీ అందాలి - అంబేద్కర్ జయంతి వేడుకల్లో యువనేత పృథ్వీరాజ్**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** అంటరానితనం కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలు తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని యువనేత పృథ్వీరాజ్ అన్నారు. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వైసీపీ నాయకులు సన్మాన ధనరాజు, కనికెళ్ల ప్రసాద్, పొలమాల సత్తిబాబు, మాజీ కౌన్సిలర్ మండపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, మున్సిపల్ మాజీ చైర్మన్ పతివాడ దుర్గారాణి తదితరులతో పాటు పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని 7, 8, 10, 11 వార్డుల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాలపర్తి ప్రవీణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని దేశవ్యాప్తంగా పండుగ వాతావరణంలో జరుపుకుంటున్నారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నేటి యువత నడుచుకోవాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్యం ప్రతి ఇంటికీ అందుబాటులోకి రావాలన్న ఆయన కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. రాజబాబు మాట్లాడుతూ అంబేద్కర్ రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించి దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించారని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషి అపారమని కొనియాడారు. యువత ఆయన ఆశయాలను అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పిల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పోతంశెట్టి ప్రసాద్, ముమ్మిడివరపు బాపురాజు, మారిశెట్టి సత్యనారాయణ, ముక్కా దాలయ్య, విప్పర్తి సింహాచలం, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు షేక్ ఆలీఖాన్ బాబా, మీగడ శ్రీను, శెట్టి నాగేశ్వరరావు, ఎర్రగుంట అయ్యప్ప, కొడమంచిలి భాస్కరరావు, సాధనాల శివ, దార్ల అబ్రహం, జొన్నపల్లి సత్తిబాబు, మడికి ఆనందరావు, మండపల్లి సుధాకరరావు, సూరంపూడి సత్యప్రసాద్, సొసైటీ మాజీ చైర్మన్ పెంకే గంగాధర్, టేకుముడి శ్రీను, వారా సన్నీ, తాడి రామారావు, అనిల్, కనికెళ్ల పల్లవి, కొనగళ్ల భాస్కరరావు, కోణాల చంద్రబోస్, తానాల వెంకన్న, అయినవిల్లి రమణ, శీలి సత్యనారాయణ, తణుకు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి : టౌన్ సిఐ దారం సురేష్



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని ప్రసాదించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని మండపేట టౌన్ సిఐ సురేష్ అన్నారు. మండపేట పట్టణ 11వ వార్డు న్యూకాలనీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. జై భీమ్ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పట్టణ సీఐ సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఐ అంబేద్కర్ జయంతి కేక్ కట్ చేసి హాజరైన వారికి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. జాతి కుల మత భేదాలు లేకుండా జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు టీడీపీ ఇంచార్జ్ కొవ్వాడ అప్పన్నబాబు, పట్టణ టీడీపీ అధ్యక్షులు మత్సా నాగు, మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పిల్లి గణేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ జానిపల్లి సురేష్, గుండుపల్లి చంద్రశేఖర్, పిట్టా శేఖర్, కొల్లాటి ప్రసాద్, పాలపర్తి శ్రీను, బెండల వెంకన్న, పల్లి రవి, వాడా ప్రసాద్ రావు, గుండు తాతరాజు, గ్రంధి శ్రీను, నేరేడుమిల్లి సత్యనారాయణ, బూసి సురేష్, వి. రాజేష్, వినకోట రాజేష్, పిట్టా అర్జున్, నూకతట్టు కిషోర్, దండిగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను మండపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.తొలుత పార్టీ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యకర్తలకు, నాయకులకు స్వీట్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుల్లో అంబేద్కర్ ఒకరని కొనియాడారు. ఐక్యరాజ్యసమితితో పాటు 132 దేశాల్లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్నారని తెలిపారు. అంబేద్కర్ గొప్ప న్యాయవేత్త, ఆర్థికవేత్త, సామాజిక సంస్కర్తగా దేశానికి అపార సేవలు అందించారని పేర్కొన్నారు. సమాజంలో అణగారిన తరగతుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఖండవల్లి లక్ష్మికి

## అంబేద్కర్ రమాబాయి అవార్డు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనేక రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మహిళా చైర్ పర్సన్ ఖండవల్లి లక్ష్మికి బి.ఆర్ అంబేద్కర్ రమాబాయి అవార్డ్ అందజేశారు. విశాఖపట్నానికి చెందిన జై భీమ్ యూనిటీ ఫౌండేషన్ అధ్వర్యంలో డా.బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు విశాఖలోని డిస్ట్రిక్ట్ పబ్లిక్ లైబ్రరీ హాలులో మంగళవారం జరిగాయి.బర్త్ డే వేడుకలలో డా.బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించడంతోపాటు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనేక రంగాలలో విశిష్ట సేవలు అందించిన ఖండవల్లి లక్ష్మికి బిఆర్ అంబేద్కర్ రమాబాయి అవార్డ్స్ అందజేశారు. అనంతరం రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యకర్తల సమావేశంలో జిల్లా, రాష్ట్ర కమిటీలు విస్తరణ జరిగింది. ఈ కార్యక్రమం జై భీమ్ యూనిటీ ఫౌండేషన్ చైర్మన్ డా.మాముదూరి వర ప్రసాద్ అధ్వర్యంలో జరుగగా ఆర్.పి. ఐ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా.పిట్ట వర ప్రసాద్,విశాఖ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ దేవేంద్ర ప్రసాద్,తూర్పు గోదావరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డా.సాల్మన్ జార్జ్. కె.లక్ష్మి.ముఖ్య అతిథిలు ఐఎన్‌టియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీమంత్రి రాజశేఖర్,జన సేన పార్టీ విశాఖ నార్త్ ఇంచార్జీ పసుపులేటి ఉష కిరణ్. బిసివై పార్టీ నమ్మి అప్పలరాజు,తెలంగాణ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ నేషనల్ సెక్రటరీ ఎస్.శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

## ఉల్లం రవి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**500 మందికి అన్నదానం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఉల్లం రవి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉల్లం రవి ఆధ్వర్యంలో మంగళవారం 500 మందికి అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ కారెం శివాజీ, శివాజీ తనయుడు డాక్టర్ కారెం, రవితేజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నేతల కిషోర్, గార అప్పారావు, గాలి రాధాకృష్ణ, బుజ్జి,ఆటో యూనియన్ ప్రెసిడెంట్ గారా త్రినాథ్, వల్లూరి రాజేష్, నేతల సందీప్, ఉల్లం విక్రాంత్, గాట్టాల మూర్తి, షేక్ బాబ్జి, తదితరులు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపకుడు అంబేద్కర్ : దాలిపర్తి వేమన





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి.ఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా కుమ్మర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్, తూర్పుగోదావరి జిల్లా కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం అధ్యక్షులు దాలిపర్తి వేమన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేమన మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి మహాత్మ జ్యోతిబా పూలే భావజాలం, అంబేద్కర్ ఆలోచనలు మార్గదర్శకమని తెలిపారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి విద్య ఎంతో కీలకమని, విద్య ద్వారానే సమానత్వం సాధ్యమని పేర్కొన్నారు. అంబేద్కర్ అణగారిన వర్గాలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించి సమాన హక్కులు సాధించేందుకు కృషి చేశారని, ఆయన సేవలు సమాజ అభివృద్ధిలో స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చూచికొండ వీరబాబు, కొత్తూరు కన్నారావు, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.


విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

✦ సువర్ణావకాశం ✦
₹99/- లకే మీ ప్రకటన!

స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.

ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు

ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్

ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999  9246033999  కాకినాడ కార్యాలయం

ఈ సినిమా చూస్తున్నంతా సేపు

# చాలా బాగా ఎంజాయ్ చేశా..

## ఆ హీరో మూవీపై రామ్ చరణ్ ప్రశంసలు

ప్రస్తుతం పెద్ది సినిమా షూటింగ్ పనుల్లో బిజీ బిజీగా ఉంటున్నాడు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్. ఈ సినిమా ఈనెల 30న విడుదల కావాల్సి ఉండంతో ప్రస్తుతం తన సమయం మొత్తం ఈ మూవీకే కేటాయిస్తున్నాడు చరణ్. అయితే ఇంత బిజీలోనూ ఓ తెలుగు సినిమాను చూసి ప్రశంసలు కురిపించాడు మెగా పవర్ స్టార్. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ సినిమా పెద్ది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా తెరకెక్కిస్తోన్న ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాలో బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్, జగపతిబాబు, సాయి కుమార్, దివ్యేందు త్రిపాఠి, సత్య తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఆస్కార్ విజేత ఏ ఆర్ రెహమాన్ ఈ మూవీకి స్వరాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మెగా మూవీ ఈనెల 30న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. దీంతో ఈ సినిమా రిలీజ్ పనుల్లో బిజీ బిజీగా ఉంటున్నాడు చరణ్. అయితే ఇంత బిజీ టైమ్ లోనూ అడివి శేష్ డెకాయిట్ సినిమాను చూశాడీ మెగా హీరో. అనంతరం నిమాపై తన అభిప్రాయలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. 'ఇప్పుడే డెకాయిట్ సినిమా చూశాను ఈ సినిమా చూస్తూ చాలా బాగా ఎంజాయ్ చేశాను. హరి పాత్రలో శేష్ తన నటనతో మరో లెవెల్ కి తీసుకెళ్లారు. శేష్ నటన చాలా కాలం పాటు గుర్తుండిపోతుంది. మృణాళ్ ఠాకూర్ తన పాత్రకు ప్రాణం పోశారు. ఈ సినిమాకు ఆమె నటనే ఒక పెద్ద అసెట్. వీరే కాకుండా ఈ సినిమాలో కీలక పాత్రలో నటించిన ఇతర నటీనటులు కూడా



అద్భుతమైన నటనను కనబరిచారు. సుప్రియ యార్లగడ్డ అన్నపూర్ణ స్టూడియోస్ ఈ కథను నమ్మి ఎక్కడ రాజీ పడకుండా నిర్మించారు. హైటెక్నికల్ వాల్యూస్ తో సినిమాను ప్రజెంట్ చేసిన విధానం చాలా అద్భుతంగా ఉంది. చిత్ర బృందం మొత్తానికి అభినందనలు' అంటూ రాసుకొచ్చారు రామ్ చరణ్. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట బాగా వైరల్ అవుతుంది. షానియల్ డియో తెరకెక్కించిన డెకాయిట్ సినిమాలో అడివి శేష్, మృణాళ్ జంటగా నటించారు. ఏప్రిల్ 10న విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్ టాక్ తో దూసుకెళుతోంది. ఇప్పటికే న్యాచురల్ స్టార్ నాని, నాగ్ అశ్విన్, లేటెస్ట్‌గా రామ్ చరణ్ తదితర సినీ ప్రముఖులు ఈ సినిమాను చూసి ప్రశంసలు కురిపించారు.

# మహేష్ బాబు లాంటి హీరోను ఎక్కడ చూడలేదు..

## ఎలాంటి సపోర్ట్ లేకుండా బిల్డింగ్ పై నుంచి దూకేశాడు..



డి.ఓ.పి. యువరాజు మహేష్ బాబు అంకితభావం, సినీ రంగంలో తన ప్రయాణం గురించి ఇటీవల వెల్లడించారు. వన్ నేనొక్కడినే సినిమా షూటింగ్ సమయంలో మహేష్ బాబు డూప్ లేకుండా, 150 అడుగుల ఎత్తు నుండి దూకడం, లైఫ్ జాకెట్ లేకుండా బోట్ ఛేజ్ సీక్వెన్స్‌లో పాల్గొనడం వంటి సాహసాలు చేశారని యువరాజు తెలిపారు. ఆయన వృత్తి పట్ల అంకితభావం, సాహసం సెట్‌లో అందరినీ ఆశ్చర్యపరిచాయని చెప్పారు. సుదీర్ఘ కాలంగా సినీ రంగంలో పనిచేస్తున్న ప్రసిద్ధ సినిమాటోగ్రాఫర్ (డి.ఓ.పి.) యువరాజు, తమ కెరీర్‌లోని కీలక సంఘటనలు, ప్రముఖ నటులు, దర్శకులతో తమ అనుభవాలను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. మహేష్ బాబు అంకితభావం, అల్లు అర్జున్ ఎదుగుదల, దర్శకుడు అట్లీ ప్రతిభ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ.ఐ.) సినిమాటోగ్రఫీపై చూపుతున్న ప్రభావం వంటి అనేక అంశాల గురించి మాట్లాడారు. వన్ నేనొక్కడినే చిత్రం షూటింగ్ సమయంలో జరిగిన రెండు సంఘటనలను యువరాజు వివరించారు. లండన్‌లో జరిగిన ఒక ఛేజ్ సీక్వెన్స్‌లో, మహేష్ బాబు 150 అడుగుల ఎత్తు నుండి డూప్ లేకుండా దూకారని ఆయన తెలిపారు. ఈ ప్రమాదకరమైన స్టంట్ సెట్‌లో ఉన్నవారందరినీ ఆశ్చర్యానికి గురి చేసిందని, ఒక చిన్న రోప్‌తో మాత్రమే మహేష్ బాబు ఈ రిస్క్ చేశారని చెప్పారు. రెండవ సంఘటన బోట్ ఛేజ్ సీక్వెన్స్‌కు సంబంధించింది. లైఫ్ జాకెట్ లేకుండా మహేష్ బాబు అత్యంత వేగంగా బోట్‌ను నడిపారని, సుకుమార్ కూడా ఈ విషయాన్ని గతంలో ప్రస్తావించారని యువరాజు గుర్తుచేసుకున్నారు. సీన్‌కు తగ్గట్టుగా లైఫ్ జాకెట్ ధరించడం సాధ్యం కాకపోవడం వల్ల, మహేష్ బాబు ఎంతో ధైర్యంగా ఆ సన్నివేశాన్ని పూర్తి చేశారని, ఇది ఆయన నిజమైన హీరో అని నిరూపించిందని ప్రశంసించారు. ఫైట్ మాస్టర్ పీటర్ హెయిన్‌తో కలిసి లైఫ్ జాకెట్ వేసుకుని బోట్‌లో వెళ్ళినప్పుడు కూడా తమకు భయం వేసిందని, అలాంటిది మహేష్ బాబు ధైర్యం తమకు స్ఫూర్తినిచ్చిందని యువరాజు పేర్కొన్నారు. డి.ఓ.పి. యువరాజు తమ సినీ ప్రస్థానం అల్లు అర్జున్ ఆర్య చిత్రంతో ప్రారంభమైందని, ఆ సినిమాలో తాను చివరి అసిస్టెంట్‌గా పనిచేశానని వెల్లడించారు. అప్పటి నుండి అల్లు అర్జున్ పుష్ప వరకు సాధించిన ఘనత తనకు తెలుసునని అన్నారు. . అల్లు అర్జున్ ఎదుగుదల అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

ఆ టాలీవుడ్ స్టార్ హీరోతో

# అలియా భట్..

## పాన్ ఇండియా ప్రాజెక్టులో బాలీవుడ్ బ్యూటీ..

బాలీవుడ్ బ్యూటీ అలియా భట్.. చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. అటు హిందీలో ఆమె సినిమాలు తగ్గించేసింది. తాజాగా ఈ బ్యూటీ గురించి ఓ ఇంట్రెస్టింగ్ న్యూస్ ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతుంది. ఆమె మరోసారి తెలుగు తెరపై సందడి చేయనుందనే టాక్ వినిపిస్తుంది. ఇందుకు సంబంధించి పలు విషయాలు అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. బాలీవుడ్ బ్యూటీ అలియా భట్ క్రేజ్ గురించి తెలిసిందే. హిందీలో తక్కువ సమయంలోనే తనదైన ముద్ర వేసిన ఈ అమ్మడు.. గంగుబాయి కతియవాడి వంటి సినిమాతో జాతీయ అవార్డ్ అందుకుంది. గ్లామరస్ కథానాయికగా.. ఇటు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలతోనూ మెప్పించింది. ఇదివరకే తెలుగులో ఓ సినిమాలో కనిపించి దక్షిణాది సినీ ప్రియుల హృదయాలు గెలుచుకుంది అలియా. తాజాగా ఈ అమ్మడు మరోసారి తెలుగు తెరపై సందడి చేయనుందని టాక్. రాబోయే పాన్ ఇండియా తెలుగు చిత్రంలో ఓ కీలకపాత్రలో ఈ ముద్దుగుమ్మ కనిపించనుందని టాక్. ఆ సినిమాలో ఒక ముఖ్య పాత్ర కోసం అలియా పేరును పరిశీలిస్తున్నారట మేకర్స్. ఇది ఖరారైతే మరోసారి తెలుగు సినీప్రియులను ఈ అమ్మడు అలరించడం ఖాయమని తెలుస్తోంది. ఇప్పటికే ఆ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా విపరీతమైన బజ్ నెలకొంది. ఎప్పుడెప్పుడు ఆ సినిమా విడుదలవుతుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు ఆడియన్స్. ఈ క్రమంలోనే మోస్ట్ అవైటెడ్ చిత్రంలో ఇప్పుడు అలియా సైతం భాగమవుతుందనే టాక్ వినిపించడంతో ఆ ప్రాజెక్ట్ పై మరింత హైప్ ఏర్పడింది. ఇంతకీ ఆ ప్రాజెక్ట్ ఏంటీ.? అనే విషయాలు తెలుసుకుందామా. ఎన్టీఆర్ హీరోగా డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న లేటేస్ట్ చిత్రం డ్రాగన్ (ప్రచారంలో ఉన్న పేరు). కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ వేగంగా జరుగుతుంది. ఈ సినిమాలో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుంది. ఈ మూవీ కోసం ఎన్టీఆర్ లుక్ పూర్తిగా మార్చేశారు. కండలు తిరిగిన దేహంతో ఇటీవల షేర్ చేసిన ఫోటోతో అభిమానులకు సర్ ప్రైజ్ ఇచ్చారు. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ డ్రాగన్ సినిమాలో ఓ పవర్ ఫుల్ పాత్రలో అలియా భట్ కనిపించనున్నారట. ఈ సినిమాలో డైరెక్టర్ ప్రశాంత్ నీల్ ఓ పవర్ ఫుల్ పాత్రను డిజైన్ చేశారని.. అందులో కథానాయికగా రోల్ కోసం అలియా పేరు పరిశీలిస్తున్నారని టాక్. గతంలో ఆర్ఆర్ఆర్ చిత్రంలో సీత పాత్రలో కనిపించింది అలియా.



# చెన్నై ఖాతాలో రెండో విజయం.. మరోసారి ఓడిన కోల్‌కతా

కోల్‌కతా నైట్ రైడర్స్ తమ సొంత మైదానమైన చెపాక్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో 32 పరుగుల తేడాతో ఓడిపోయి, జరుగుతున్న ఐపీఎల్ సీజన్‌లో తమ నాలుగో ఓటమిని చవిచూసింది. కోల్‌కతా నైట్ రైడర్స్ తమ సొంత మైదానమైన చెపాక్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో 32 పరుగుల తేడాతో ఓడిపోయి, జరుగుతున్న ఐపీఎల్ సీజన్‌లో తమ నాలుగో ఓటమిని చవిచూసింది. మంగళవారం 192 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కోల్‌కతా నైట్ రైడర్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 160 పరుగులు మాత్రమే చేయగలిగింది. అంతకుముందు, టాస్ ఓడిపోయి బ్యాటింగ్ ఎంచుకున్న సీఎస్‌కే 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది.

**శాంసన్, మాత్రే, బ్రేవిస్‌ల కీలక ఇన్నింగ్స్..**
**కోల్‌కతా ముందు భారీ టార్గెట్?**

ఐపీఎల్ 22వ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌కు 193 పరుగుల లక్ష్యాన్ని









నిర్దేశించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం (చెపాక్)లో జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. సీఎస్కే 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. ఐపీఎల్ 22వ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్‌కు 193 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం (చెపాక్)లో జరిగిన ఈ మ్యాచ్‌లో కేకేఆర్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. సీఎస్కే 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. సంజు సామ్సన్ 32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 48 పరుగులు చేశాడు. డెవాల్డ్ బ్రెవిస్ 29 బంతుల్లో 41 పరుగులు చేశాడు. ఆయుష్ మహాత్రే 17 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 పరుగులు చేశాడు. కేకేఆర్ తరఫున కార్తిక్ త్యాగి రెండు వికెట్లు తీయగా, వైభవ్ అరోరా, అనుకుల్ రాయ్, సునీల్ నరైన్ తలా ఒక వికెట్ పడగొట్టారు.

**రెండు జట్లు..**

చెన్నై సూపర్ కింగ్స్: సంజు శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మ్హాత్రే, సర్ఫరాజ్ ఖాన్, డెవాల్డ్ బ్రూయిస్, శివమ్ దూబే, జామీ ఓవర్టన్, నూర్ అహ్మద్, అన్షుల్ కాంబోజ్, ఖలీల్ అహ్మద్, గుర్జప్నీత్ సింగ్.

**ఇంపాక్ట్ ప్లేయర్లు:** మాథ్యూ షార్ట్, అకేల్ హొసేన్, కార్తీక్ శర్మ, ప్రశాంత్ వీర్, మాట్ హెన్రీ.

**కోల్‌కతా నైట్ రైడర్స్:** అజింక్యా రహానే (కెప్టెన్), అంగ్రిష్ రఘువంశీ (వికెట్ కీపర్), కామెరాన్ గ్రీన్, రింకు సింగ్, రమణదీప్ సింగ్, రోవ్‌మన్ పావెల్, సునీల్ నరైన్, అనుకుల్ రాయ్, వరుణ్ చక్రవర్తి, కార్తీక్ త్యాగి, వైభవ్ అరోరా.

**ఇంపాక్ట్ ప్లేయర్లు:** ఫిన్ అలెన్, మనీష్ పాండే, తేజస్వి సింగ్, నవదీప్ సైనీ, టిమ్ సీఫెర్ట్.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com